## నీలగిరి నిత్యపద్యం

ఆటవెలది

ఆసనములు వేయు నారోగ్యసూత్రాలు
కఠినమైన గాని క్రమము గాను
నేర్పుతోడ వేయ కూర్చును స్వస్థత,
నలతలేమిరావు నరుడ నీకు

మీ
విజయప్రసాద్ నలుమాసు
తెలుగు బోధకులు,కవి


RNI - TELTEL/2023/87644

# నీలగిరి ఎక్స్‌ప్రెస్

తెలుగు దిన పత్రిక



### విలేకరులు కావలెను

తెలంగాణ &ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రాలలో (నీలగిరి ఎక్స్ ప్రెస్): & చైతన్య గళం ఛానల్ లో పని చేయుటకు
- బ్యూరో ఇన్చార్జ్ లు- జిల్లా స్టాఫ్ రిపోర్టర్ లు -ఇన్చార్జ్ లు
- మండల రిపోర్టర్ లు
- క్రైమ్ రిపోర్టర్ లు
-జిల్లాల వారిగా ఆడ్ ఇన్చార్జ్ లు కావలెను. వివరాలకు మా WHATS APP నంబర్:- 9705770909 సంప్రదించండి.



సంచిక : 42 | సంపుటి : 3 | తెలంగాణ | ఆంధ్రప్రదేశ్ | ఆదివారం | 21-06-2026 | పేజీలు-8 | వెల: రూ. 5.00




### హైడ్రా ద్వారా 600
## ఆపరేషన్స్ పూర్తి

- లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడాం
- హైడ్రాపై దుష్ప్రచారం తగదు
- మీడియా సమావేశంలో కమిషనర్ రంగనాథ్

హైదరాబాద్

హైడ్రాపై దుష్ప్రచారం జరుగుతోందని.. పనిగట్టుకుని తమను కొందరు బద్నాం చేస్తున్నారని హైడ్రా కమిషనర్ రంగనాథ్ పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం ఉండాలని, కాని దుష్ప్రచారంతో అడ్డుకోరాదని తెలిపారు. దోపిడీకి గురికాకుండా ఉండాలని ప్రత్యేక తెలంగాణ కోసం ఇక్కడి ప్రజలు కొట్లాడారని తెలిపారు. హైడ్రా ద్వారా లక్షా పదివేల కోట్ల ఆస్తులు కాపాడామని వివరించారు. శనివారం హైదరాబాద్ వేదికగా రంగనాథ్ మీడియాతో మాట్లాడారు. హైడ్రా ద్వారా 600 ఆపరేషన్స్ పూర్తి చేశామని తెలిపారు. చట్టం అందరికీ ఒకటేనని... హైడ్రా ఎవరికీ పక్షపాతంగా వ్యవహరించదని

-మిగతా 2 లో

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన



ఉరుములు, పిడుగులతో ముంచెత్తనున్న వానలు

- తెలుగు రాష్ట్రాల్లో నేటి నుంచి చల్లబడనున్న వాతావరణం
- రెండు రాష్ట్రాల్లోని పలు జిల్లాలకు భారీ వర్ష సూచన
- హైదరాబాద్‌లో రాత్రి పూటమారనున్న వాతావరణం

హైదరాబాద్–

తెలుగు రాష్ట్రాల్లో వాతావరణం ఎప్పుడు ఎలా మారుతుందో అర్థం కాని పరిస్థితి నెలకొంది. ఇప్పటికే రుతుపవనాలు ఎంట్రీ ఇచ్చినా, అక్కడక్కడ మాత్రమే వర్షాలు కురిశాయి.. అయితే, నేటి నుంచి వాతావరణం పూర్తిగా చల్లబడనుంది, ఇరు రాష్ట్రాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని

-మిగతా 2 లో

# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా



### తెలంగాణ పాడి పరిశ్రమను లాభసాటిగా మారుస్తాం

- 27 లక్షల మంది విద్యార్థులకు 'విజయ' పాలు
- పాడి రైతులకు బకాయిలు లేని చెల్లింపులు
- లాభసాటిగా తెలంగాణ పాడి పరిశ్రమ
- డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క వెల్లడి

హైదరాబాద్

రాష్ట్రంలో పాడి పరిశ్రమ మీద ఆధారపడి జీవనం సాగిస్తున్న రైతులను ఆదుకోవడంతో పాటు విజయా డైరీనీ ఆర్థికంగా బలోపేతం చేసేందుకు ప్రజాప్రభుత్వం అవసరమైన చర్యలు తీసుకుంటుందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. రాష్ట్రంలోని పాడిపరిశ్రమను ఆదుకోవాలని, పాల ఉత్పత్తులపై ఆధారపడిన వారి జీవితాలకు ఆర్థిక భరోసా కల్పించేందుకు ప్రజాప్రభుత్వం కృత నిశ్చయంతో పనిచేస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పిన మాటను ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు,అంగన్ వాడీ కేంద్రాలకు విజయ డెయిరీ నుంచి పాలను సరఫరా చేయాలని ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించి సాధ్యాసాధ్యాలపై ఉప

-మిగతా 2 లో





### టికెట్ లేకపోతే
## ఫైన్ డబుల్!.

- వచ్చే నెల1 నుంచి అమల్లోకి
- జరిమానాను రూ.250 నుంచి రూ500కు పెంచిన రైల్వే శాఖ

న్యూఢిల్లీ -

టికెట్ లేకుండా రైలు ప్రయాణం చేస్తే ఇక నుంచి డబుల్ పెనాల్టీ కట్టాల్సిందే. రైల్వేశాఖ టికెట్ లేని ప్రయాణాలపై విధించిన ఫైన్‌ను రెట్టింపు చేసింది. ఇప్పటి వరకు రూ.250గా ఉంటే ఇప్పుడు రూ.500కు పెంచింది. జూలై 1 నుంచి ఇది అమల్లోకి రానున్నది. టికెట్ లేకుండా ప్రయాణిస్తే, వారు ప్రయాణం చేసిన దూరం వరకు అసలు టికెట్ ధరపై ఇక నుంచి రూ.500 చెల్లించాల్సిందే. ఒకవేళ ప్రయాణికుడు ఏ స్టేషన్‌లో ఎక్కాడో స్పష్టత లేకుంటే.. రైలు ప్రయాణం ప్రారంభమైన స్టేషన్ నుంచి ధర చెల్లించాల్సి ఉంటుంది. అలాగే ఇతరుల పేరుమీద టికెట్ బుక్ చేసుకుని ప్రయాణం చేస్తే ఆ టికెట్ చెల్లదు. ప్రయాణికుడు రూ.500 కట్టాలి.లేదంటే న్యాయపరమైన చర్యలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. ప్రయాణికులు లేదా చిరు వ్యాపారులు ఎవరైనా సరే అనుమతి లేకుండా రైళ్లలో, స్టేషన్లలో ఆహార పదార్థాలు అమ్మితే రూ.2 వేలు జరిమానా విధిస్తారు.

-మిగతా 2 లో



## బండి భగీరథకు ఊరట

- పోక్సో కేసులో వారం రోజుల మధ్యంతర బెయిల్..
- ఇంజనీరింగ్ పరీక్షలు రాసేందుకు అనుమతించిన మేడ్చల్-మల్కాజిగిరి కోర్టు

తెలంగాణ బ్యూరో :

పోక్సో కేసులో అరెస్టయి రిమాండ్‌లో ఉన్న బండి భగీరథకు న్యాయస్థానంలో తాత్కాలిక ఊరట లభించింది. ఇంజనీరింగ్ పరీక్షలకు హాజరయ్యేందుకు వీలుగా మేడ్చల్–మల్కాజిగిరి కోర్టు ఆయనకు వారం రోజుల పాటు షరతులతో కూడిన మధ్యంతర బెయిల్ మంజూరు చేసింది. కోర్టు నుంచి బెయిల్ ఉత్తర్వులు వెలువడటంతో శనివారం మధ్యాహ్నం భగీరథ చర్లపల్లి సెంట్రల్ జైలు

-మిగతా 2 లో





### పీఎం కిసాన్
## డబ్బులు విడుదల


- రైతుల ఖాతాల్లో రూ.18,880 కోట్లు జమ
- హుగ్లీ వేదికగా బటన్ నొక్కి నిధులను విడుదల చేసిన ప్రధాని మోదీ
- దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతు కుటుంబాలకు లబ్ధి
- ఏటా మూడు విడతల్లో రూ.6,000 పెట్టుబడి సాయం
- ఇ-కేవైసీ చేసుకున్న వారికే పీఎం కిసాన్ సొమ్ము

కోల్‌కతా

పీఎం కిసాన్ డబ్బులు విడుదలయ్యాయి. ప్రధాని మోదీ 23వ విడత నిధులను విడుదల చేశారు. ఈ విడత ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న 9.44 కోట్ల మందికి పైగా అర్హులైన రైతు కుటుంబాల ఖాతాల్లోకి రూ. 2,000 చొప్పన మొత్తం రూ. 18,880 కోట్లు నేరుగా జమయ్యాయి. రైతులకు పెట్టుబడి సాయం అందించేందుకు కేంద్రం అమలు చేస్తున్న పీఎం-కిసాన్నిధులు విడుదలయ్యాయి. పశ్చిమ బెంగాల్‌లోని హుగ్లీ జిల్లాలో జరిగిన కార్యక్రమంలో ప్రధాని నరేంద్ర మోదీ ఈ నిధులను విడుదల చేశారు. 23వ విడత కింద ఒక్కో రైతు ఖాతాలో రూ.2 వేలు చొప్పన జమ అయ్యాయి. దీంతో దేశవ్యాప్తంగా 9.44 కోట్ల మంది రైతులకు లబ్ధి చేకూరింది. కేందప్రభుత్వం 2019లో పీఎం-కిసాన్ పథకాన్ని

-మిగతా 2 లో

## హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్



- లెబనాన్‌పై ఇజ్రాయెల్ వైమానిక దాడులే కారణమని వెల్లడి
- అమెరికాతో శాంతి ఒప్పందం కుదిరిన కొద్దిరోజులకే కీలక నిర్ణయం
- కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఇజ్రాయెల్ ఉల్లంఘించిందన్న ఇరాన్ మిలిటరీ
- శనివారం దక్షిణ లెబనాన్‌పై డ్రోన్ల దాడి.. ఇద్దరు పిల్లలు సహా 16 మంది మృతి
- దాడులు ఆపకుంటే మరిన్ని కఠిన చర్యలు తప్పవని ఇరాన్ హెచ్చరిక

న్యూఢిల్లీ -

ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. హోర్ముజ్ జలసంధిని మరోసారి మూసివేసింది. అమెరికాతో శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా ఇరాన్ మళ్లీ హోర్ముజ్‌ను మూసేసింది. దీనికి కారణం ఇజ్రాయెల్. కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘించి.. లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు జరపడమే ఇందుకు కారణం. శనివారం కూడా దక్షిణ లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడిచేసింది. అమెరికాతో కుదుర్చుకున్న శాంతి ఒప్పందాన్ని ఉల్లంఘించి, ఇజ్రాయెల్ దాడులు చేసినందుకే హోర్ముజ్‌ను మూసేస్తున్నామని ఇరాన్ ప్రకటించింది. ఈ మేరకు ఇరాన్ జాయింట్ మిలిటరీ టాప్ కమాండ్ అయిన ఖతమ్ అల్ అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ ప్రకటించింది.అంతేకాదు.. ఇజ్రాయెల్ చర్యలపై ఇది ప్రాథమిక స్పందన మాత్రమే అని, ఇకపై దాడులు ఆపకుంటే,

-మిగతా 2 లో

### బెంగాల్‌లో ప్రజాధనాన్ని దోచుకున్న
## వారు జైలుకు వెళ్లాల్సిందే:





### అనర్హులను ఏరివేయడమే
# సర్ లక్ష్యం

అదే సందర్భంలో అర్హులకు అన్యాయం జరగనివ్వం

- ఒక వర్గం ఓట్లను తొలగిస్తారనేది అపోహ మాత్రమే
- కుల, మతాలకతీతంగా ఎన్యూమరేషన్ ఫారాల అందజేత
- ప్రతి ఒక్కరూ తప్పని సరిగా ఓటు నమోదు చేసుకోవాలి
- మ్యాపింగ్ అయిన వారు ఆధారాలు సమర్పించాల్సిన అవసరం లేదు
- రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి

-హైదరాబాద్

తెలంగాణ రాష్ట్రంలో అనర్హులను ఏరి వేయడమే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియ లక్ష్యమని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి తెలిపారు. శనివారం హైదరాబాద్‌లోని బీఆర్కే భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితాలో ప్రస్తుతం ఎక్కడ ఓటు ఉందో అదే అడ్రస్‌కు ఎన్యూమరేషన్ ఫాంను బీఎల్ఓ అందజేస్తారని తెలిపారు. ఆ అడ్రస్‌లో ఓటరు లేకపోతే అతని ఓటు అక్కడ తొలగించబడుతుందన్నారు. ప్రస్తుతం ఉంటున్న అడ్రస్‌తో మళ్లీ ఓటరు ఫాం8తో ఓటును నమోదు చేసుకునే అవకాశం ఉంటుందని చెప్పారు. సర్ ప్రధాన ఉద్దేశం ఓటర్ల జాబితాను ప్రక్షాళన చేయడమనీ.. ఓటర్లను తొలగించడం కాదని స్పష్టం చేశారు. 24 ఏండ్లుగా రాష్ట్రంలో ఓటర్ జాబితా నవీనీకరణ జరగలేదన్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది మృతి చెంది ఉంటారనీ, కొందరు వలస వెళ్లి ఉంటారని తెలిపారు. వాటన్నింటినీ సరి చేయడానికే ఎన్నికల సంఘం సర్‌ను చేపట్టిందని చెప్పారు.

-మిగతా 2 లో







### కాంగ్రెస్ నేతల
## కాలర్ పట్టుండి

- పంటలు కొనకుంటే నిలదీయండి
- బోనస్, రైతుబంధు ఏమైందో అడగండి
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

ఆదిలాబాద్:–

పంటలను కొనుగోలు చేయకపోతే రైతులు కాంగ్రెస్ నేతలను కాలర్ పట్టి నిలదీయాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. ప్రభుత్వం ప్రకటించిన బోనస్ ఏమైందో, రైతుబంధు ఎందుకు ఇవ్వడం లేదో అడగాలని సూచించారు. ఇటీవల ఆత్మహత్య చేసుకున్న ఆదిలాబాద్ జిల్లా సిరికొండ మండలం పొన్న గ్రామానికి చెందిన రైతు పాండురంగ కుటుంబాన్ని శనివారం కేటీఆర్ పరామర్శించారు. రూ. 3 లక్షల ఆర్థికసాయం అందజేశారు. అనంతరం నేరడిగొండలో నిర్వహించిన పార్టీ జనరల్ బాడీ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. రైతు సమస్యలను

-మిగతా 2 లో



### కిషన్ రెడ్డికి సీఎం
## రేవంత్ రెడ్డి మరో లేఖ

- కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి
- హైదరాబాద్ మెట్రో రైల్ సమస్యల పరిష్కారానికి కేంద్రం జోక్యం కోరిన సీఎం
- సోమ, మంగళవారాల్లో ఢిల్లీ పర్యటనలో ఉండనున్న రేవంత్ రెడ్డి
- జూన్ 16న రాసిన లేఖలోని అంశాలను గుర్తుచేసిన ముఖ్యమంత్రి
- ఐఆర్ఎఫ్‌సీ ఫైనాన్సింగ్, రుణ ఒప్పందాలపై చర్చించడమే లక్ష్యం
- మెట్రో టేకోవర్, ఫేజ్ 2 ప్రతిపాదనల ప్రతులతో ఢిల్లీకి సీఎం
- సమావేశం ఏర్పాటు చేసి తనకు సమాచారం ఇవ్వాలని కిషన్‌రెడ్డికి కోరిన రేవంత్

హైదరాబాద్–

మెట్రో ఫేజ్–2కు సంబంధించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి మరో లేఖాస్త్రం సంధించారు. మెట్రో ఫేజ్–2, ఐఆర్ఎఫ్‌సీ ఫైనాన్సింగ్‌కు సంబంధించిన అంశాలపై కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ ఏర్పాటు చేయాలని సీఎం కిషన్ రెడ్డిని కోరారు. ఈమేరకు శనివారం సీఎం మరో లేఖ రాశారు. జూన్ 16న తాను రాసిన లేఖలో హైదరాబాద్ మెట్రో రైల్‌కు సంబంధించిన

-మిగతా 2 లో

## హైడ్రా ద్వారా 600
# ఆపరేషన్స్ పూర్తి

మొదటి తరువాయి

స్పష్టం చేశారు. హైడ్రా డిజాస్టర్ కోసం కాదని.. ఆస్తుల పరిరక్షణ కోసమేనని తేల్చిచెప్పారు. సోషల్ మీడియాలో తమపై అసత్యాలు చెబుతున్నారని అన్నారు. ప్రభుత్వ ఆస్తులను కాపాడటంలో రాష్ట్ర సర్కార్ హైడ్రాకి ఫ్రీడం ఇచ్చిందని రంగనాథ్ వెల్లడించారు. పార్టీలకు అతీతంగా తాము పనులు చేస్తున్నామని చెప్పుకొచ్చారు. భాగ్యనగరంలో ఫాతిమా కాలేజీ లాగా చాలా స్కూల్స్, కాలేజీలు ఉన్నాయని ప్రస్తావించారు. హైడ్రాకి ఎంఐఎం, కాంగ్రెస్ అందరూ ఒకటేనని తేల్చిచెప్పారు. హైడ్రా ఎప్పుడూ సైలెంట్‌గా ఉండదన్నారు. హైడ్రా రాత్రికి రాత్రి నిర్మాణాలను కూలగొడుతుందనేది తప్పుడు ప్రచారమని తెలిపారు. గుడిసెలు వేసిన చోట మీడియాని తీసుకెళ్లి చూపించామని... అప్పుడు ఉన్నదాని కంటే వంద గుడిసెలు ఎక్కువగా పెరిగాయని.. దాని వెనకాల కొన్ని శక్తులు ఉన్నాయని చెప్పుకొచ్చారు. గుడిసెలు వేసిన చోట జెన్యూన్‌గా ఉన్నాయా? లేదా? పరిశీలించి... డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. హైడ్రా రాకపోతే... ఇప్పుడు ఉన్నవి కూడా కనపడకుండా పోయేవని రంగనాథ్ తెలిపారు. ఈ నెల 9వ తేదీన భాగ్యనగరంలో కురిసిన వర్షానికి సిటీ అతలాకుతలం అయిందని అన్నారు. లక్షమందికి మంచి చేయాలంటే కొందరికి చెడు జరుగుతుందని తెలిపారు. హైడ్రా తప్పు ఉంటే తప్పకుండా క్షమాపణ అడుగుతామని చెప్పారు. హైడ్రా చాలా నేర్చుకుందని, చాలా పనులు పూర్తి చేసిందని... తప్పులు జరిగితే.. సరి చేసుకుంటూ ముందుకెళ్తుందని వివరించారు. హైడ్రా సెటిల్‌మెంట్లకు అడ్డాగా కాకుండా.. రాజకీయాలకు అతీతంగా ముందుకు పోతుందని స్పష్టం చేశారు. ప్రజలకు నమ్మకం, విశ్వాసం కలిగేంచే విధంగా హైడ్రా పని చేస్తోందని రంగనాథ్ పేర్కొన్నారు.

# బండి భగీరథకు ఊరట


మొదటి తరువాయి



నుంచి విడుదలయ్యారు. భగీరథ ప్రస్తుతం ఇంజనీరింగ్ చదువుతున్నారని, త్వరలో ఆయనకు పరీక్షలు ఉన్నాయని ఆయన తరఫు న్యాయవాదులు పిటిషన్ ద్వారా కోర్టు దృష్టికి తీసుకువెళ్లారు. విద్యార్థి భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పరీక్షలు రాసేందుకు అనుమతించాలని కోరారు. న్యాయవాదుల వాదనలు విన్న న్యాయమూర్తి, వాటిని పరిగణనలోకి తీసుకుని ఈనెల 26వ తేదీ వరకు భగీరథకు మధ్యంతర బెయిల్ కల్పిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అయితే బెయిల్ కాలంలో న్యాయస్థానం విధించిన షరతులను తప్పనిసరిగా పాటించాల్సి ఉంటుందని న్యాయమూర్తి ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు.

## తెలుగు రాష్ట్రాలకు భారీ వర్ష సూచన

మొదటి తరువాయి



వాతావరణ శాఖ తెలిపింది. ఏపీలోని ఉత్తరాంధ్ర, దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాలపై వర్షాల ప్రభావం ఎక్కువగా ఉండబోతోంది. ముఖ్యంగా శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి సీతారామరాజు, కాకినాడ, విశాఖపట్నం, గుంటూరు, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లో పిడుగులతో కూడిన భారీ వర్షాలు పడే ఛాన్స్ ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. మిగిలిన జిల్లాల్లో తేలికపాటి నుండి మోస్తరు వానలు కురుస్తాయి. తెలంగాణలో నేడు ఉరుములు, మెరుపులతో కూడిన వానలు పడతాయని వాతావరణ శాఖ తెలిపింది. ముఖ్యంగా సెంట్రల్, దక్షిణ తెలంగాణ జిల్లాలపై దీని ప్రభావం తీవ్రంగా ఉంటుంది. సంగారెడ్డి, వికారాబాద్, రంగారెడ్డి, మెదక్, సిద్దిపేట్, మహబూబ్ నగర్, వనపర్తి, నాగర్ కర్నూల్, నారాయణ పేట్, నల్గొండ, యాదాద్రి భువనగిరి, జనగాం, కామారెడ్డి జిల్లాల్లో సాయంత్రం నుండి అర్ధరాత్రి సమయంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉంది. హైదరాబాద్‌లో కూడా పగటిపూట ఎండ ఉన్నప్పటికీ.. రాత్రి సమయంలో వాతావరణం ఒక్కసారిగా మారిపోయి ఉరుములు, పిడుగులతో కూడిన వర్షాలు పడే ముప్పు ఉందని వెదర్ రిపోర్ట్స్ చెబుతున్నాయి.

## టికెట్ లేకపోతే ఫైన్ డబుల్!.

మొదటి తరువాయి

రైళ్లు, రైల్వే స్టేషన్లలో భిక్షాటన నిషేధం. రైలు నిబంధనలు పదే పదే ఉల్లంఘిస్తే జైలుశిక్ష విధిస్తారు. మహిళలకు కేటాయించిన బెర్త్‌లు, కోచ్‌లలో పురుషులు కూర్చుంటే రూ.2500 జరిమానా విధిస్తారు. తోటి ప్రయాణికులతో అసభ్యకరంగా ప్రవర్తించినా, దూషించినా భారీగా పెనాల్టీ వేస్తారు.

## పీఎం కిసాన్ డబ్బులు విడుదల

మొదటి తరువాయి




ప్రారంభించింది. ఏటా మూడు దఫాలుగా రూ.2 వేలు చొప్పున మొత్తంగా రూ.6వేలను రైతుల ఖాతాల్లో వేస్తున్నారు. పీఎం కిసాన్ నిధులు పొందే వారి జాబితాలో మీ పేరుందో లేదో తెలుసుకోవచ్చు. ఇందుకోసం పీఎం కిసాన్ వెబ్‌సైట్‌లోకి వెళ్లిఅందులో 'ఫార్మర్ కార్నర్' సెక్షన్‌లోకి వెళ్లాలి. అందులో లబ్దిదారుల లిస్ట్‌పై క్లిక్ చేస్తే రాష్ట్రం, జిల్లా, బ్లాక్, గ్రామం ఎంచుకుంటే లబ్దిదారుల జాబితా కనిపిస్తుంది. అందులో మీ పేరు ఉందో లేదో తెలుసుకోవచ్చు. ఇ-కేవైసీ చేయని వారికి నిధులు జమ కావు. కాబట్టి అదే పోర్టల్‌లో ఇ-కేవైసీ ఆప్షన్ ఎంచుకుని ఆధార్ నంబర్, ఓటీపీ ద్వారా వెరిఫికేషన్ పూర్తి చేయొచ్చు.

# పాడి రైతుకు ప్రభుత్వం భరోసా

మొదటి తరువాయి

ఖముఖ్యమంత్రి నేతృత్వంలో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం సచివాలయంలో జరిగింది. ఈ సమావేశంలో డిప్యూటీ సీఎంతో పాటు పశు సంవర్ధక శాఖా మంత్రి వాకిటి శ్రీహరి పాల్గొన్నారు. ఈ సమావేశంలో రాష్ట్రంలో పాల వినియోగం, సేకరణ, రైతులకు చెల్లించాల్సిన బిల్లులపై లోతైన చర్చ
జరిగింది. ఈ సందర్భంగా ఉప ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రాష్ట్రంలో ప్రస్తుతం ఉన్న పాల వినియోగం, కొత్తగా ప్రభుత్వం ప్రకటించిన మేరకు వివిధ పాఠశాలల్లో చదువుకుంటున్న 27 లక్షల మంది విద్యార్థులకు పాలను అందించే అంశంపై అధికారులతో చర్చించారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో మొత్తం పాల ఉత్పత్తికి సంబంధించి ఖచ్చితమైన లెక్కలు తీసుకురావాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రవ్యాప్తంగా అధికారులు క్షేత్రస్థాయికి వెళ్లి పాలిచ్చే పశువుల అసలు సంఖ్యను గుర్తించాలని ఆదేశించారు. పాలిచ్చే పశువుల ద్వారా వస్తున్న వాస్తవ ఉత్పత్తిని లెక్కగట్టి సమగ్ర నివేదికను తదుపరి సమావేశంలో ఇవ్వాలని సంబంధిత అధికారులకు డిప్యూటీ సీఎం ఆదేశించారు.ల్గ÷తుల నుంచి సేకరించే పాల ధరపై స్పష్టమైన విధానం ఉండాలన్నారు. రైతులకు బకాయిలు లేకుండా ఎప్పటికప్పుడు బిల్లులు చెల్లించేలన్నారు. పాఠశాలలకు సరఫరా చేసే పాలకు సంబంధించిన బిల్లులను సంక్షేమ శాఖలు నేరుగా ఆయా విభాగాలకే బదిలీ చేయాలని చెప్పారు. దీనివల్ల రైతులకు ఎలాంటి బకాయిలు ఉండవని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలు పాడి పరిశ్రమ మీదే ఆధారపడతారని ఉప ముఖ్యమంత్రి అన్నారు. ఈ నేపథ్యంలో పాడి రైతులకు సమయానికి డబ్బులు చెల్లిస్తే.. వారి కుటుంబం ఆర్థికంగా బలోపేతం అవుతుంది.. డైరీకి నమ్మకంతో పాలు పోస్తారని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో పాడి పరిశ్రమను లాభసాటిగా మార్చేందుకు, పాల ఉత్పత్తులను గణనీయంగా పెంచేందుకు ఆధునిక పద్దతులను అనుసరించాలని ఆయన సూచించారు. రైతులకు వ్యవసాయం పైనే కాకుండా, పాడి పరిశ్రమ ద్వారా అదనపు జీవనోపాధి కల్పించేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు తీసుకోవాలన్నారు.

# బెంగాల్‌లో ప్రజాధనాన్ని దోచుకున్న వారు జైలుకు వెళ్లాల్సిందే:




**కోల్‌కతా,**
పశ్చిమ బెంగాల్‌లో ఎవరైతే ప్రజాధనాన్ని దోచుకున్నారో వారు ఇప్పుడు దానిని తిరిగి ఇచ్చేసి జైలు శిక్షను అనుభవించాల్సి వస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు. హుగ్లీ జిల్లా తారకేశ్వర్‌లో శనివారం జరిగిన పశ్చిమబెంగ దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వం లక్ష్యంగా విమర్శలు గుప్పించారు. గత ప్రభుత్వాలు రాష్ట్ర అభివృద్ధికి ఆటంకాలు కలిగించడమే కాక, ఉద్యోగావకాశాల కోసం బెంగాల్ వదిలి వెళ్లాల్సిన దుస్థితిని కల్పించాయని అన్నారు.గత ప్రభుత్వాలు ఎలా పనిచేశాయో మనం కండ్లారా చూశాం. వారు బెంగాల్‌ను వెనుకబాటుతనంలోకి నెట్టేసి మహా నిర్గమన రాష్ట్రంగా మార్చేశారు' అని అన్నారు. కొత్తగా అధికారంలోకి వచ్చిన బీజేపీ ప్రభుత్వం రాష్ట్రాన్ని అభివృద్ధి దిశగా తీసుకువెళ్లడానికి ప్రయత్నాలు ప్రారంభించిందని, ప్రస్తుతం బెంగాల్‌లో తాజాగా ఆశావహ దృక్పథం కనిపిస్తున్నదని అన్నారు.

## హోర్ముజ్ జలసంధిని మళ్లీ మూసివేసిన ఇరాన్

మొదటి తరువాయి

పరిస్థితి ఇలాగే కొనసాగితే ఇంకా కఠిన చర్యలు తీసుకుంటామని ఇరాన్ హెచ్చరించింది. దాడులు కొనసాగితే తీవ్ర పరిణామాలుంటాయని వార్నింగ్ ఇచ్చింది. ఈ నిర్ణయం ప్రపంచానికి షాకింగే. ముఖ్యంగా పశ్చిమాసియాపై ఇరాన్ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపిస్తుంది. ఇరాన్ నిర్ణయంతో అక్కడి నౌకల కదలికలు నిలిచిపోయాయి. లెబనాన్‌పై శనివారం ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో 16 మంది మరనించారు. వీరిలో ఇద్దరు పిల్లలు కూడా ఉన్నారు. ఇంతకుముందే శుక్రవారం ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదిరింది. అటు అమెరికా, ఇరాన్ మధ్య, ఇటు లెబనాన్, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరినప్పటికీ.. ఇజ్రాయెల్ శనివారం డ్రోన్లతో దాడి చేయడం సంచలనంగా మారింది. మరోవైపు ఇజ్రాయెల్ దాడులపై అమెరికా కూడా అసహనం వ్యక్తం చేస్తోంది. శాంతి ఒప్పందం కుదిరిన తర్వాత కూడా దాడులు చేయడాన్ని తప్పుబడుతోంది. ఈ విషయంలో అమెరికా అధ్యక్షుడు ట్రంప్.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుకు కీలక సూచన చేశారు. నెతన్యాహు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. నెతన్యాహు తనకు చాలా మంచి మిత్రుడు అని, అయితే, ఆయన చర్యలను అడ్డుకోక తప్పదని ట్రంప్ వ్యాఖ్యానించారు. తాజాగా హోర్ముజ్‌ను మూసేస్తూ ఇరాన్ తీసుకున్న నిర్ణయంపై అమెరికా ఎలా స్పందిస్తుందో చూడాలి.

# అనర్హులను ఏరివేయడమే సర్ లక్ష్యం

మొదటి తరువాయి

ఇందులో రాజకీయ ప్రేరేపితం ఏమీ లేదనీ, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. కులం, మతంతో సంబంధం లేకుండా రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఓటర్ నమోదు ఫారం ఇస్తారని తెలిపారు. ఎన్యూమరేషన్‌లో ముస్లిం, హిందూ అనే వ్యత్యాసం ఉండదని చెప్పారు. ఒక వర్గం ఓట్లు తొలగిస్తారనే ఆందోళన అవసరం లేదని సీఈవో సుదర్శన్ రెడ్డి వెల్లడించారు.

జులై 25 నుంచి ఇంటింటి సర్వే ప్రారంభం
జూన్ 25 నుంచి జులై 24 వరకు బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌ఓలు) ఇంటింటి సర్వే నిర్వహిస్తారని ఎన్నికల అధికారి సి. సుదర్శన్‌రెడ్డి చెప్పారు. జులై 1న ముసాయిదా ఓటర్ జాబితా ప్రచురణ, జులై 31 నుంచి ఆగస్టు 30 వరకు అభ్యంతరాల స్వీకరణ, సెప్టెంబర్ 28 వరకు వాటి పరిష్కారం అనంతరం అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను ప్రచురిస్తామని పేర్కొన్నారు. ఇందుకు సంబంధించి ఈఆర్ఓ, బీఎల్‌ఓలకు ఎన్నికల సంఘం మార్గదర్శకాలు జారీ చేసినట్టు వెల్లడించారు. బీఎల్‌ఓలు ప్రతి ఇంటిని సందర్శించి రెండు ప్రతుల ఓటరు నమోదు ఫారాలను అందజేస్తారనీ, అందులోని కాలాలన్నింటినీ పూరించి తిరిగి అందజేయాలన్నారు. బీఎల్‌ఓ ఇంటిని సందర్శించినప్పుడు ఇంటికి తాళం వేసి ఉంటే, కనీసం మూడు సార్లు సందర్శిస్తారని ఎన్నికల అధికారి తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రాష్ట్ర ప్రజలకు ఆయన విజ్ఞప్తి చేశారు. ఎవరైనా ఓటర్ నమోదు ఫారం అందజేయకుంటే వారు ఓటర్‌గా నమోదు కారని స్పష్టం చేశారు. సర్ ప్రక్రియను క్షేత్రస్థాయిలో పకడ్బందీగా నిర్వహించేందుకు భారత ఎన్నికల కమిషన్ జారీ చేసిన మార్గదర్శకాలను జిల్లా ఎన్నికల అధికారులు, ఎన్నికల నమోదు అదికారులు కచ్చితంగా పాటించాలని ఆదేశించినట్టు తెలిపారు. బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లు స్వచ్ఛంద కార్యకర్తలతో సమన్వయం చేసుకుని పారదర్శకంగా నమోదు ప్రక్రియను చేపడతారని వెల్లడించారు. క్షేత్రస్థాయిలో కనీసం వారానికి ఒకసారి సమీక్షా సమావేశాలను నిర్వహించి అవగాహన కార్యక్రమాలను చేపడతామని చెప్పారు.

**పూర్తి సమాచారం ఇవ్వని వారికి నోటీసులు**
బీఎల్‌ఓలు పంపిణీ చేసిన ఓటర్ నమోదు ఫారంలో పూర్తి సమాచారం పొందు పర్చని వారికి నోటీసులు జారీ చేస్తామని తెలిపారు. వారి నుంచి వచ్చే సమాధానం ఆధారంగా నిబంధనల మేరకు వారి ఓటు నమోదుపై ఈసీ నిర్ణయం తీసుకుంటుందని తెలిపారు. అలాగే నిర్దిష్ట సమయంలో నమోదు ఫారం సమర్పించలేని ఓటర్లు, క్లెయిమ్ లు, అభ్యంతరాల కాలంలో నిర్దేశిత ప్రకటన ఫారంతో పాటు ఫారం-6 సమర్పించి పేరు నమోదు కోసం దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పూర్తి వివరాలు సమర్పించని ఓటర్ల విషయంలో ఈఆర్‌వో, ఏఈఆర్‌వోలు విచారణ చేస్తారని తెలిపారు.

?సర్ మ్యాపింగ్ తప్పని సరి కాదు
సర్ మ్యాపింగ్ తప్పని సరి కాదనీ, మ్యాపింగ్ అయిన వారు ఈసీ గుర్తించిన ఆధారాలు సమర్పించాల్సిన అవసరం లేదన్నారు. ఓటర్ల పేరు లేదా తమ తల్లిదండ్రులు, తాత లేదా అమ్మమ్మ పేర్లు 2002 ప్రత్యేక సమగ్ర సవరణ ఓటరు జాబితాలో ఉన్నట్లయితే వాటి వివరాల ఆధారంగా బీఎల్‌ఓ మ్యాపింగ్ చేస్తారని తెలిపారు. సర్‌లో నమోదు కాని వారు తమ స్థానికతను రుజువు చేసుకునేందుకు ఆధార్ కార్డు మినహా 11 గుర్తింపు కార్డులు చెల్లుబాటు అవుతాయని పేర్కొన్నారు. అందులో ఏదైనా ఒక కార్డును బీఎల్‌ఓకు సమర్పించాలని తెలిపారు.

?రాష్ట్రంలో సర్ షెడ్యూల్....
ఇంటింటి గణన....... జూన్ 25 నుంచి జులై 24 వరకు
ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ ............ జులై 31
అభ్యంతరాల దాఖలు ....... జులై 31 నుంచి ఆగస్టు 08 వరకు
అభ్యంతరాల పరిష్కారం......... జులై 31 నుంచి ఆగస్టు 28 వరకు
తుది ఓటరు జాబితా ప్రచురణ.................. అక్టోబర్ 1

## కాంగ్రెస్ నేతల
# కాలర్ పట్టుండి

మొదటి తరువాయి

విస్మరిస్తున్న ప్రభుత్వానికి ప్రజలే తగిన బుద్ధి చెప్పాలని వ్యాఖ్యానించారు. రైతులు పండించిన పంటలను చివరి గింజ వరకు కొనుగోలు చేస్తామని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం.. ఇప్పుడు కేంద్రం కోటా ప్రకారమే అని చెప్పడం రైతులను మోసం చేయడమేనన్నారు. రైతుబంధు బకాయిలు, బోనస్, పంటల కొనుగోళ్ల విషయంలో ప్రభుత్వం స్పష్టత లేకుండా వ్యవహరిస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వం సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఉందన్నారు. రైతుల పట్ల చిత్తశుద్ధి ఉంటే వెంటనే కొనుగోళ్లు పూర్తి చేసి బకాయిలు విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఎస్ఈఆర్ పై అప్రమత్తంగా ఉండాలి
ఓటరు జాబితా ప్రక్షళన అంటూ చేపడుతున్న ఎస్ఈఆర్ ప్రక్రియపై అనేక అనుమానాలున్నాయని కేటీఆర్ అన్నారు. ఇతర రాష్ట్రాల్లో ఓటర్ల పేర్లు తొలగినట్లు ప్రచారం జరిగిందని, తెలంగాణలో కూడా అలాంటి పరిస్థితులు తలెత్తకుండా పార్టీ కార్యకర్తలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ నెల 25 నుంచి ప్రారంభమయ్యే ప్రక్రియలో ప్రతి బూత్ స్థాయిలో ఓటరు జాబితాను పరిశీలించాలని, అర్హులైన ఒక్క ఓటరు పేరు కూడా తొలగిపోకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు అనిల్ జాదవ్, కోవ లక్ష్మి, ప్రశాంత్ రెడ్డి, కౌశిక్ రెడ్డి, సంజయ్, ఎమ్మెల్సీ నవీన్ కుమార్ రెడ్డి, మాజీ మంత్రి జోగు రామన్న, మాజీ ఎమ్మెల్యే జీవన్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కిషన్ రెడ్డికి సీఎం
# రేవంత్ రెడ్డి మరో లేఖ

మొదటి తరువాయి



సమస్యలను ప్రస్తావించానని గుర్తుచేశారు. పెండింగ్ అంశాలకు త్వరితగతిన పరిష్కారం అవసరమని, అందుకు కేంద్రం జోక్యం చేసుకోవాలని కోరినట్టు తెలిపారు. సోమ, మంగళవారాల్లో తాను ఢిల్లీలో ఉంటానని, ఆ సమయంలో కేంద్ర రైల్వే మంత్రి అశ్విని వైష్ణవ్‌తో సమావేశం ఏర్పాటు చేయాలని కిషన్‌రెడ్డిని కోరారు. మెట్రో టేకోవర్, ఐఎఫ్ఆర్‌సీతో రుణ ఒప్పందాలు, మెట్రో ఫేజ్ 2 ప్రతిపాధనల ప్రతులను కూడా తాను తీసుకువస్తానని సవాల్ విసిరారు. సమావేశం ఏర్పాటు చేసి తనకు సమాచారం ఇవ్వాలని ఆయన కిషన్‌రెడ్డిని కోరారు.

# ఘనంగా ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభం



**ఖానాపూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కార్యక్రమంలో భాగంగా ఖానాపూర్ మండలంలోని మస్కాపూర్, బావాపూర్ కె, రాజురా, బీర్‌నంది గ్రామాల్లో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభమయ్యాయి. శనివారం పాఠశాలలను రంగురంగు కాగితాలు, బేలులు, మామిడి తోరణాలతో అలంకరించి పండుగ వాతావరణంలో తరగతులను ప్రారంభించారు. రాజురా, బావాపూర్ కె పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు ప్రవీణ్, సంతోష్, సర్పంచ్ రాజేశ్వర్, పాఠశాల చైర్మన్, వార్డు సభ్యులు పాల్గొని తరగతులను ప్రారంభించారు. రాజురాలో సర్పంచ్ మల్లేష్, వార్డు సభ్యులు, చైర్మన్ తరగతిని ప్రారంభించారు. ఇన్స్ట్రక్టర్లు, ఆయాలు విధుల్లో చేరి దాదాపు 25 మంది చిన్నారులను ప్రీ ప్రైమరీ తరగతుల్లో చేర్పించారు. ఈ కార్యక్రమంలో పలు గ్రామాల సర్పంచులు, ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, తల్లిదండ్రులు, వార్డు సభ్యులు, జిపిఓలు, సీఆర్పీలు పాల్గొన్నారు.

## బావాపూర్ కె పాఠశాలలో తల్లిదండ్రుల సమావేశం



**ఖానాపూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మండలంలోని బావాపూర్ కె పాఠశాలలో శనివారం పిటిఎం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు సంతోష్ మాట్లాడుతూ విద్యార్థులను ప్రైవేట్ పాఠశాలలకు పంపకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని తల్లిదండ్రులకు సూచించారు. ప్రీ ప్రైమరీ తరగతులు ఏర్పాటు చేసినందున 3--5 ఏళ్ల పిల్లలను తప్పనిసరిగా ప్రభుత్వ పాఠశాలకు పంపాలని తీర్మానించారు. పిల్లలను పనికి తీసుకెళ్లకుండా సమయానికి పాఠశాలకు పంపాలని, గ్రామంలో చదువుకోకుండా ఉన్న వారిని గుర్తించి పాఠశాలకు చేర్పించాలని కోరారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత పుస్తకాలు, దుస్తులు, మధ్యాహ్న భోజనం, సీఎం కిట్టు, అల్పాహారం, రాగి జావ అందిస్తోందని తెలిపారు. ఈ సమావేశంలో సర్పంచ్ మైసరాజేశ్వర్, పాఠశాల చైర్మన్, వార్డు సభ్యులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## లీగల్ సర్వీసెస్ కమిటీ సమక్షంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహణ



**ఖానాపూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మండల లీగల్ సర్వీసెస్ కమిటీ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కమిటీ చైర్‌పర్సన్ జెఎఫ్‌సిఎం బి. నిఖిత అధ్యక్షత వహించారు. క్రిమినల్, సివిల్, ఎంసి, డివిసి, పిఎల్సి, బ్యాంకు సంబంధిత కేసులు సహా మొత్తం 439 కేసులు పరస్పర రాజీ ద్వారా పరిష్కరించబడ్డాయి. ఈ సందర్భంగా జడ్జి బి. నిఖిత మాట్లాడుతూ, రాజీ మార్గమే రాజమార్గం అని, లోక్ అదాలత్‌లు తక్కువ ఖర్చుతో, త్వరితగతిన న్యాయం పొందడానికి ఉత్తమ వేదిక అని సూచించారు. ఈ కార్యక్రమంలో అడ్వకేట్ బెంచ్ సభ్యులు ఎస్‌కె. షబ్బీర్ పాషా, జి. నరేంద్రనాథ్, సిహెచ్. చంద్రకాంత్, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

## రాంరెడ్డిపల్లిలో భూ వివాదం

**కర్రలతో ఘర్షణ -- నలుగురికి గాయాలు**



**మర్రిగూడ, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
మర్రిగూడ మండలంలోని రాంరెడ్డిపల్లి గ్రామపంచాయతీ పరిధిలో వ్యవసాయ భూమి బాట పంచాయతీ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. ఈ వివాదంలో ఇరు కుటుంబాలు పరస్పరం కర్రలతో దాడి చేసుకోవడంతో నలుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. గాయపడిన వారిని స్థానిక మర్రిగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఇరు వర్గాల ఫిర్యాదుల ఆధారంగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మర్రిగూడ ఎస్సై బి. రాంబాబు తెలిపారు. గ్రామంలో ఉద్రిక్తత నెలకొనగా, పోలీసులు శాంతి భద్రతల కోసం అదనపు బందోబస్తు ఏర్పాటు చేశారు.

## శాతవాహన విశ్వవిద్యాలయంలో ఘనంగా వికసిత్ భారత్ కార్యక్రమం



**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
శాతవాహన విశ్వవిద్యాలయంలో ప్రధానమంత్రి వికసిత్ భారత్ రోజ్‌గార్ యోజన కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో మేయర్ కొలగాని శ్రీనివాస్ మాట్లాడుతూ, 2047 నాటికి భారతదేశాన్ని నైపుణ్యాభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే కేంద్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడం, వారిని ప్రోత్సహించడం ఈ పథక ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విజ్ఞాన్ భవన్ నుండి వర్చువల్ విధానంలో ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారని, దేశవ్యాప్తంగా 15 లక్షల మంది యువతకు ప్రోత్సాహకాలు అందజేయబడ్డాయని ఆయన వెల్లడించారు. కరీంనగర్ యువత ఈ అవకాశాలను వినియోగించుకోవాలని మేయర్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ప్రాంతీయ పీఎఫ్ కమిషనర్, విశ్వవిద్యాలయ వైస్ ఛాన్సలర్, రిజిస్ట్రార్, అదనపు కలెక్టర్‌తో పాటు పలువురు అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీసీ రోడ్లు, డ్రైనేజీ పనులకు శంకుస్థాపన



**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కరీంనగర్ నగరపాలక సంస్థలో అభివృద్ధి కార్యక్రమాలు వేగవంతమవుతున్నాయి. 50వ డివిజన్‌లో రూ. 67 లక్షల వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రైనేజీ పనులను కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగర సమగ్ర అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని తెలిపారు. అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కింద రూ. 840 కోట్ల ప్రతిపాదనలు ఆమోదం పొందాయని, రాబోయే రెండు నెలల్లో డీటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ సిద్ధం చేసి పనులను ప్రారంభించనున్నట్లు వెల్లడించారు. అదే రోజు 26వ డివిజన్ ఆదర్శనగర్‌లో రూ. 30.50 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు మేయర్ శంకుస్థాపన చేశారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించేందుకు అన్ని డివిజన్లలో మౌలిక వసతుల అభివృద్ధికి కృషి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమాల్లో డిప్యూటీ మేయర్ యాదగిరి సునీల్ రావు, కార్పొరేటర్లు ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, వైద్యుల అంజన్ కుమార్, కో-ఆప్షన్ సభ్యురాలు చిగురు వెంకటమ్మ, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

## కొరటపల్లి గ్రామానికి జాతీయ స్థాయి గౌరవం



**గంగాధర, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలోని కొరటపల్లి గ్రామ పంచాయతీ ఆత్మనిర్భర్ మహిళా పంచాయత్ పోటీల్లో దేశవ్యాప్తంగా ప్రథమ స్థానం సాధించింది. మహిళల స్వావలంబన, జీవనోపాధి అవకాశాల పెంపు, స్వయం సహాయక సంఘాల బలోపేతం, సామాజిక అభివృద్ధి రంగాల్లో సాధించిన పురోగతిని గుర్తిస్తూ ఈ అవార్డు ప్రకటించారు. గ్రామ సర్పంచ్ మేకల మహేశ్వరి ప్రభాకర్ యాదవ్ మాట్లాడుతూ ఈ విజయం గ్రామంలోని మహిళల అంకితభావం, శ్రమ ఫలితమని పేర్కొన్నారు. మహిళల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం మరింత కృషి చేస్తామని తెలిపారు. ఈ సందర్భంగా గ్రామంలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి. ప్రజలు పెద్ద ఎత్తున సంబరాలు నిర్వహించి తమ హర్షాన్ని వ్యక్తం చేశారు. సర్పంచ్ మహేశ్వరిని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఘనంగా సత్కరించారు. గ్రామ ప్రజలు, మహిళా సంఘాల సభ్యులు, ప్రజాప్రతినిధులు పాల్గొని ఈ విజయాన్ని గర్వంగా జరుపుకున్నారు.

## ఒక్క పూట బడులు నిర్వహించాలి

**ఎండ తీవ్రతపై బీజేపీ జిల్లా కార్యదర్శి విజ్ఞప్తి**

**ఎలిగేడు, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
వర్షాకాలం వచ్చినప్పటికీ వర్షాలు పడక, ఎండ తీవ్రత అధికంగా ఉండటంతో పాఠశాల చిన్నారులు ఉక్కపోత, వేడిని తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. ఈ నేపథ్యంలో బీజేపీ జిల్లా కార్యదర్శి గర్రెపల్లి నారాయణస్వామి మాట్లాడుతూ, "వాతావరణం చల్లబడేంతవరకు ఒక్క పూట బడులు నిర్వహించాలని ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలి" అని విజ్ఞప్తి చేశారు. తల్లిదండ్రులు కూడా చిన్నారుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఒక్క పూట బడులు నిర్వహించాలని కోరుతున్నారని, ముఖ్యంగా ప్రాథమిక పాఠశాలలకు వెళ్లే చిన్నారుల కోసం ఈ నిర్ణయం అత్యవసరమని ఆయన పేర్కొన్నారు. అధికారులు, ప్రభుత్వం తక్షణమే స్పందించి చిన్నారుల ఆరోగ్య రక్షణకు అనుగుణంగా విద్యా షెడ్యూల్‌ను సవరించాలని నారాయణస్వామి సూచించారు.

## స్త్రీ నిధి రికవరీ 100శాతం పూర్తి చెయ్యాలి

**- కలెక్టర్ కోయ శ్రీహర్ష**



**పెద్దపల్లి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్**
స్త్రీ నిధి రికవరీని 100 శాతం సాధించడంతో పాటు రుణాల పంపిణీని పూర్తిగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. శనివారం నిర్వహించిన జిల్లా సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ రుణ చెల్లింపులు పూర్తిగా డిజిటల్ విధానంలో జరగాలని, అన్ని లావాదేవీలు మన స్త్రీ నిధి యాప్ ద్వారానే జరగాలని సూచించారు. అక్రమాలకు పాల్పడే వివోఏలపై కఠిన చర్యలు తీసుకోవాలని, రుణాలు సకాలంలో చెల్లించని సంఘాలపై అవసరమైతే రెవెన్యూ రికవరీ చట్టం ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు. జూన్ నెలాఖరు నాటికి రికవరీని 70 శాతానికి, క్రెడిట్ లక్ష్యాన్ని కనీసం 30 శాతానికి చేరేలా కృషి చేయాలని ఆదేశించారు. జీవనోపాధి రుణాల మంజూరును పెంచి, జీరో రికవరీ సంఘాల సంఖ్యను సున్నాకు తీసుకురావాలని సూచించారు. జూలపల్లి, ఎలిగేడు, పాలకుర్తి, మంథని, ధర్మారం, సుల్తానాబాద్, ఓదెల, శ్రీరాంపూర్, పెద్దపల్లి మండలాల్లో ప్రత్యేక కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. మహిళల ఆర్థిక సాధికారతకు స్త్రీ నిధి రుణాలను సమర్థవంతంగా వినియోగించాలని కలెక్టర్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఓ కాళిందిని, ఏడిఆర్డిఓ రవీందర్, స్త్రీ నిధి ఆర్‌ఎం ఆర్. దుర్గాప్రసాద్, జిల్లా సమాఖ్య అధ్యకురాలు స్వప్న, కార్యదర్శి శోభా, కోశాధికారి స్వప్నతో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు ఏడు రకాల వరి సాగు చేస్తే బోనస్ పొందే అవకాశం




**పెద్దపల్లి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
పెద్దపల్లి జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన యూరియా బుకింగ్ యాప్ శిక్షణ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతులు యూరియా కొనుగోలులో ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారంగా కలెక్టర్ కోయ శ్రీహర్ష చొరవతో యాప్‌ను ప్రవేశపెట్టామని తెలిపారు. గత రబీ సీజన్‌లో 4.40 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసినట్లు పేర్కొన్నారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ నుంచి ప్రభుత్వం ప్రకటించిన బోనస్ పొందాలంటే రైతులు బీపీటీ, హెచ్‌ఎంటీ సోనా, జై శ్రీరామ్, తెలంగాణ సోనా, వరంగల్-44, 1638, 7715 అనే ఏడు వరి రకాలనే సాగు చేయాలని సూచించారు. ఇందుకు అవసరమైన విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని, రైతులకు విస్తృత అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. రైతులు ప్రత్యామ్నాయ పంటల వైపు దృష్టి సారించాలని, ఆయిల్ పామ్ సాగు ద్వారా అధిక లాభాలు పొందవచ్చని తెలిపారు. జూన్ 30 నుంచి రైతు భరోసా ఖరీఫ్ నిధులు విడుదల కానున్నాయని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ కొప్పుల వెంకటరెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా సహకార అధికారి శ్రీమాల, అధికారులు, ఎరువుల డీలర్లు, రైతులు పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీల్లో ఆకస్మిక తనిఖీ చేపట్టిన డివిజనల్ పంచాయతీ అధికారి



**ఖానాపూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
నిర్మల్ జిల్లా డివిజనల్ పంచాయతీ అధికారి లింగయ్య ఖానాపూర్ మండలంలోని కొలాంగూడ, ఏరువా చింతల్, బీర్‌నంది గ్రామపంచాయతీలను ఆకస్మికంగా పరిశీలించారు. జిల్లా పరిషత్ హై స్కూల్, ఇందిరమ్మ ఇల్లు, నర్సరీలు, గ్రామపంచాయతీ రికార్డులను పరిశీలించిన ఆయన, ఇళ్ల నిర్మాణ పనులను త్వరగా పూర్తి చేయాలని సూచించారు. నర్సరీలలో మొక్కలను ఎండ తీవ్రత నుంచి కాపాడేందుకు నీటి సరఫరా సక్రమంగా ఉండాలని ఆదేశించారు. బీర్‌నంది ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశమైన ఆయన, వర్షాకాలం దృష్ట్యా తరగతి గదులు, పాఠశాల ఆవరణలో పరిశుభ్రత పాటించాలని, నీరు నిల్వ లేకుండా చూడాలని సూచించారు. వంటశాలలో శుభ్రత, మంచినీటి వినియోగం, పాత్రల పరిశీలనపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ రత్నాకర్ రావు, హెచ్‌ఎం జిఎల్వి ప్రసాద్, స్కూల్ అసిస్టెంట్ ప్రకాష్, పంచాయతీ కార్యదర్శి దేవేందర్ రెడ్డి, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# క్రీడల్లో ప్రతిభ కనబరిచిన అద్విత విద్యార్థులు




**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
అద్విత ఇంటర్నేషనల్ స్కూల్ విద్యార్థులు చెస్, బాస్కెట్‌బాల్ పోటీల్లో ప్రతిభ కనబరిచి పాఠశాలకు కీర్తి తెచ్చారు.6వ తరగతి విద్యార్థినులు ఆరాధ్య, మానస్వి చెస్ ఛాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకాలు సాధించగా, నాగ కార్తికేయ బాస్కెట్‌బాల్ టోర్నమెంట్‌లో స్వర్ణ పతకం గెలిచాడు.వారి విజయాలను పాఠశాల అసెంబ్లీలో ఘనంగా అభినందించారు. డైరెక్టర్ అనుదీప్ సౌగాని విద్యార్థులను ప్రోత్సహిస్తూ విద్యతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు చప్పట్లతో అభినందించగా, తల్లిదండ్రులు, కోచ్‌ల సహకారానికి యాజమాన్యం కృతజ్ఞతలు తెలిపింది.

## అక్రమ ఇసుక రవాణాకు చెక్

**- ఎస్ఐ నరేందర్ రెడ్డి**



**గన్నేరువరం, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
తిమ్మాపూర్ మండలం రేణికుంట గ్రామ శివారులోని మోయతుమ్మద వాగు నుండి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.గన్నేరువరం మండలంలోని జంగపల్లి గ్రామం వద్ద పట్టుబడిన ఈ ట్రాక్టర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ నరేందర్ రెడ్డి తెలిపారు. డ్రైవర్, యజమానిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్లు ఆయన పేర్కొన్నారు.

## విద్యుత్ తీగల దొంగలు అరెస్ట్




**కరీంనగర్ రూరల్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
అల్యూమినియం విద్యుత్ తీగలు దొంగిలిస్తున్న ఇద్దరు దొంగలను పోలీసులు పట్టుకున్నారు.ఉదయం నగునూరు--జూబ్లీనగర్ రోడ్డులో తనిఖీల సమయంలో ఆటోలో అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో వారు మహ్మద్ సల్మాన్ అలియాస్ లొల్లూ సల్మాన్, ఇమ్రాన్ అలియాస్ ఇమ్రాన్ అని తెలిపారు. గత నెలలో చర్ల బుత్కూర్ సబ్‌స్టేషన్ వద్ద రాత్రి సమయంలో తీగలు దొంగిలించి గుర్తు తెలియని వ్యక్తికి విక్రయించినట్లు అంగీకరించారు. దొంగతనానికి ఉపయోగించిన ఆటోను స్వాధీనం చేసుకుని నిందితులను కోర్టులో హాజరుపరచనున్నట్లు పోలీసులు తెలిపారు. సల్మాన్ గతంలో కూడా పలు దొంగతనం కేసుల్లో నిందితుడిగా ఉన్నట్లు దర్యాప్తులో బయటపడింది.

## జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు

**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



తిమ్మాపూర్ మండలంలోని జ్యోతిష్మతి ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్‌సీసీ క్యాడెట్లకు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలపై ప్రత్యేక అవగాహన సదస్సు జరిగింది.ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సంజీవ్ మాట్లాడుతూ యువత రోడ్డు ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోవడం ఆందోళనకరమని, ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలను కచ్చితంగా పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, మితిమీరిన వేగం, ట్రిపుల్ రైడింగ్, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ వాడకాన్ని నివారించాలని ఆయన హెచ్చరించారు.కమాండింగ్ ఆఫీసర్ ఎన్‌సీసీ క్యాడెట్లను సమాజంలో మార్పు తీసుకురావడానికి ట్రాఫిక్ నియమాలను కుటుంబ సభ్యులకు, స్నేహితులకు వివరించాలని సూచించారు. యువత రోడ్డు భద్రతను సామాజిక బాధ్యతగా గుర్తించాలని అధికారులు స్పష్టం చేశారు.ఈ సదస్సులో కాలేజీ యాజమాన్యం, ఎన్‌సీసీ ఆర్మీ స్టాఫ్, వందలాది క్యాడెట్లు పాల్గొని రోడ్డు నిబంధనలను పాటిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# రైతు భరోసా నిధులను, బీమా బకాయిలను చెల్లించాలని బీఆర్ఎస్ డిమాండ్



**పెద్దపల్లి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
రైతులకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించి మోసం చేస్తోందని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్ రెడ్డి విమర్శించారు. స్థానికంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రైతు భరోసా నిధులను ప్రభుత్వం మూడు సార్లు పూర్తిగా ఎగ్గొట్టి, రెండు సార్లు కేవలం రెండు ఎకరాలకే పరిమితం చేసిందని అన్నారు. రైతు బీమా ప్రీమియంను సకాలంలో చెల్లించకపోవడం వల్ల మరణించిన రైతుల కుటుంబాలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.సన్న వరి రకాల బోనస్ విషయంలో కూడా ప్రభుత్వం మాట తప్పిందని పేర్కొన్నారు. ఎన్నికల ముందు అన్ని రకాల వడ్లకు బోనస్ ఇస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చిన తర్వాత 34 రకాలకే పరిమితం చేసి, ఇప్పుడు వాటిలో కేవలం 7 రకాల వరికే అనుమతిస్తున్నారని విమర్శించారు. కేంద్రం వరి పంట మొత్తాన్ని కొనడం లేదనే సాకుతో రాష్ట్ర ప్రభుత్వం బోనస్ భారాన్ని తప్పించుకోవాలని చూస్తోందని ఆరోపించారు. యూరియా ధరలను తగ్గించాలని, రైతులకు అవసరమైన ఎరువులు సమయానికి అందించాలని డిమాండ్ చేశారు.రైతు భరోసా నిధులను వెంటనే విడుదల చేయాలని, బీమా బకాయిలను చెల్లించాలని, సన్న వరి బోనస్ విషయంలో రైతులకు న్యాయం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. లేనిపక్షంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతాంగంతో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.ఈ సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు నూనేటి సంపత్, స్రవంతి మోహన్ రావు, సందీప్ రావు, మార్కు లక్ష్మణ్, పారుపల్లి గుణపతి, వెన్నం రవీందర్, మోబిన్, పెంచల శ్రీధర్, పూదరి చంద్రశేఖర్, సలేంద్ర రాములు, ఫకీర్ యాదవ్, దీకొండ భూమేష్, అనుముల బాపూరావు, కాల్వల ఓదన్న, రేవల్లి తిరుపతి, మియాపూర్ శ్రీనివాస్, పోసాని శ్రీనివాస్, గందె మల్లికార్జున్, తిప్పారపు దయాకర్, ఆరెపల్లి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## జీడీసీ మహిళా కళాశాలలో ఏఐ, డిజిటల్ లెర్నింగ్ శిక్షణ



**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: అన్నా అక్క మెంటార్‌షిప్ కార్యక్రమం కింద నిర్వహించిన టీచింగ్ ఇంటర్న్‌షిప్ ఆన్ ఏఐ మరియు డిజిటల్ లెర్నింగ్ శిక్షణ రెండో రోజు విజయవంతంగా ముగిసింది. గవర్నమెంట్ డిగ్రీ కళాశాల ఫర్ ఉమెన్ (అటానమస్)లో జరిగిన ఈ శిక్షణలో అరవింద్ కుమార్ నాయిని విద్యార్థులకు ఏఐ సాధనాలు, డిజిటల్ లెర్నింగ్ విధానాలు, కోడ్‌మిత్ర ప్లాట్‌ఫారమ్ వినియోగంపై ప్రాయోగిక శిక్షణ అందించారు. విద్యార్థుల చురుకైన భాగస్వామ్యాన్ని ఆయన అభినందిస్తూ, ఈ శిక్షణతో వారు పాఠశాల విద్యార్థులకు ఏఐ ఆధారిత డిజిటల్ విద్యను అందించగలరని విశ్వాసం వ్యక్తం చేశారు.ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ డి. వరలక్ష్మి విద్యార్థులు తమ జ్ఞానాన్ని పాఠశాల పిల్లల ప్రయోజనార్థం వినియోగించాలని సూచించారు. కార్యక్రమాన్ని నోడల్ అధికారులు డా. ఆర్. మొగిలి, డా. ఎం. కల్పన, జె. స్వప్న సమన్వయం చేశారు. అధ్యాపకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.చివరగా డా. ఆర్. మొగిలి వోట్ ఆఫ్ థ్యాంక్స్ తెలియజేయడంతో కార్యక్రమం ముగిసింది.

## రైతులపై కాంగ్రెస్ నిర్ణయాలను విమర్శిస్తున్న బీఆర్ఎస్

**హుస్నాబాద్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



రాష్ట్రంలోని రైతులను అనాథలుగా మార్చే విధానాలు కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తోందని మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ తీవ్రంగా విమర్శించారు.కేంద్రం నిర్ణయించిన కోటా మేరకే పంటలు కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం రైతులకు మరణశాసనమని ఆయన అన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం రైతు బంధు, రైతు బీమా, ఉచిత విద్యుత్, యూరియా సరఫరా, మిషన్ కాకతీయ, కాళేశ్వరం వంటి పథకాలతో రైతులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.కాంగ్రెస్ ప్రభుత్వం రైతు భరోసా, బీమా ప్రీమియం, బోనస్ చెల్లింపుల విషయంలో విఫలమైందని, ఇప్పటికే వేలాది రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను విస్మరించి రైతులను మోసం చేస్తున్నారని ఆరోపించారు.రైతుల పట్ల నిర్లక్ష్య వైఖరిని కొనసాగిస్తే బీఆర్ఎస్ పార్టీ రైతాంగంతో కలిసి పెద్ద ఎత్తున ఉద్యమానికి శ్రీకారం చుడుతుందని సతీష్ కుమార్ హెచ్చరించారు.

## యుజిడి పనులకు శంకుస్థాపన

**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



53వ డివిజన్ శర్మనగర్‌లో సుడా నిధులతో రూ.20 లక్షల వ్యయంతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణ పనులకు సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు ప్రజల సమస్యలు పరిష్కరించడంలో కలిసికట్టుగా ముందుకు సాగుతామని, అంతర్గత రోడ్లు, డ్రైనేజీలకు నిధులు వెచ్చించి పనులను వేగవంతం చేస్తున్నామని తెలిపారు. ఇంకా అనేక ప్రాంతాల్లో పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేయాలని ప్రయత్నిస్తున్నామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిఈ రాజేంద్ర ప్రసాద్, కార్పొరేటర్ కొంపెల్లి శ్వేతా, రమణ్, మహమ్మద్ మేరాజ్, సమియొద్దీన్, హరికృష్ణ, అబ్దుల్ వసీం, అనిల్, రాము, శ్రీనివాస్, కలీమ్, ముల్కల కవిత, అస్థాపురం తిరుమల, జ్యోతిరెడ్డి, కీర్తి కుమార్, బషీర్, ఇమ్రాన్, వర్క్ ఇన్స్పెక్టర్ అజ్మల్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు మంజూరు చెయ్యాలని సిపిఐ డిమాండ్



**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
కరీంనగర్ నగరంలోని అర్హులైన నిరుపేదలకు వెంటనే డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు కేటాయించాలని సిపిఐ జిల్లా కార్యదర్శి పంజాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు.సిపిఐ నగర శాఖ సమావేశంలో ఆయన మాట్లాడుతూ, పేదలు ఇళ్ల లేమితో కిరాయిల్లో ఇబ్బందులు పడుతున్నారని, కొందరు ప్రాణాలు తీసుకున్న సందర్భాలు కూడా ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. చింతకుంటలో నిర్మించిన ఇండ్లను ఇప్పటికీ పేదలకు ఇవ్వకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనమని విమర్శించారు.గతంలో బిఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి అర్హుడికి ఇండ్లు ఇచ్చేందుకు కృషి చేసినప్పటికీ, ప్రస్తుత ప్రభుత్వం పేదల పట్ల చిత్తశుద్ధి చూపడం లేదని ఆయన ఆరోపించారు. ఈనెల 22న కలెక్టరేట్ ముందు ఇల్లు లేని నిరుపేదలతో ధర్నా నిర్వహించనున్నట్లు ప్రకటించారు.ఈ సమావేశంలో సిపిఐ నగర కార్యదర్శి కసిరెడ్డి సురేందర్ రెడ్డి, జిల్లా కార్యవర్గ సభ్యులు న్యాలపట్ల రాజు, కౌన్సిల్ సభ్యులు బీర్ల పద్మ, నలవాల సదానందం, గామినేని సత్యం, బాకం అంజనేయులు, సాయ వేణి రాజమల్లు, కాల్వ శ్రీనివాస్, కాల్వ కొమురయ్య, నునావత్ శ్రీనివాస్, నగునురి రమేష్, అల్లెపు రాజు, తంగేళ్ల సంపత్, తంగేళ్ల సదయ్య, బోయిని విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీపై ఎస్ఎఫ్ఐ ఆగ్రహం




**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ప్రైవేట్ కార్పొరేట్ పాఠశాలల్లో విచ్చలవిడిగా ఫీజులు వసూలు చేస్తున్న దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు కాంపెల్లి అరవింద్ డిమాండ్ చేశారు.జిల్లా కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నర్సరీ నుండి పదవ తరగతి వరకు ఫీజులు ఇష్టానుసారంగా పెంచుతూ ప్రభుత్వ నిబంధనలను ఉల్లంఘిస్తున్నారని విమర్శించారు. పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో వ్యాపారం చేస్తున్న పాఠశాలలపై అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు.రాష్ట్ర ప్రభుత్వం ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయకుండా కార్పొరేట్ పాఠశాలలకు కొమ్ము కాస్తూ విద్యా వ్యాపారాన్ని ప్రోత్సహిస్తోందని ఆరోపించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు లేకపోవడం, సంక్షేమ వసతి గృహాలను నిర్లక్ష్యం చేయడం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడటమేనని అన్నారు. వెంటనే విద్యాశాఖకు మంత్రి నియమించి, ప్రైవేట్ పాఠశాలలపై తనిఖీలు జరిపి చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి గట్టు ఆకాష్, కమిటీ సభ్యులు బెజ్జల సన్నిత్, నాయకులు బోయినీ సాయి తదితరులు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

**కరీంనగర్ రూరల్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



చామనపల్లి గ్రామానికి చెందిన విలాసాగరం కరుణాకర్ (37) రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. జూన్ 14న మొగ్దుంపూర్ వద్ద కూలీలను దింపి తిరిగి వస్తూ ద్విచక్ర వాహనం అదుపుతప్పి పడిపోవడంతో తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా భద్రకాళి ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న క్రమంలో జూన్ 20 ఉదయం ఆయన మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. భార్య విలాసాగరం మంజుల ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి విచారణ చేపట్టారు.

# గ్రామీణ రహదారులపై ప్రత్యేక దృష్టి



**బెజ్జంకి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

గ్రామీణ ప్రాంతాల్లో రహదారుల నిర్మాణాలకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ తెలిపారు. బెజ్జంకి మండలం దేవక్కపల్లి, పోతారం, పెరుకబండ గ్రామాల్లో కొత్త సీసీ రోడ్డు పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. గ్రామాల అభివృద్ధికి మెరుగైన రహదారులు అవసరమని, ప్రజలకు రాకపోకల సౌకర్యం కల్పించడంతో పాటు కనెక్టివిటీ పెంచడం ద్వారా సమగ్ర అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు. ప్రజల సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తూ పనులను నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచులు, పార్టీ నాయకులు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పులి కృష్ణ, కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ప్రైవేట్ కళాశాలల దోపిడీపై తీవ్ర విమర్శలు

**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



కరీంనగర్‌లోని కొన్ని బడా ప్రైవేట్ కళాశాలలు విద్యను సేవగా కాకుండా వ్యాపారంగా మార్చి విద్యార్థులు, తల్లిదండ్రుల ఆర్థిక పరిస్థితులను దోపిడీ చేస్తున్నాయని డీసీసీ సెక్రటరీ జెల్లోజి శ్రీనివాస్ పటేల్ తీవ్రంగా విమర్శించారు. ఒక తరగతి గదిలో 70--80 మంది విద్యార్థులను కుక్కిపెట్టి కనీస సౌకర్యాలు లేకుండా లక్షల రూపాయల ఫీజులు వసూలు చేయడం దారుణమని ఆయన అన్నారు. స్థానిక అర్హులైన లెక్చరర్లను నిర్లక్ష్యం చేస్తూ తక్కువ వేతనాలతో అధ్యాపకులను నియమించడం వల్ల విద్యా ప్రమాణాలు దిగజారుతున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తును పణంగా పెట్టి లాభాలకే ప్రాధాన్యత ఇస్తున్న కళాశాలలపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కరీంనగర్ జిల్లాలో ప్రైవేట్ కళాశాలల్లో ఫీజుల దోపిడీ, అధిక ప్రవేశాలు, అధ్యాపకుల కొరత, సౌకర్యాల లేమిపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘిస్తున్న కళాశాలలను నియంత్రించాలని ఆయన కోరారు.

# 40 ట్రాక్టర్ల ఇసుక డంపును స్వాధీనం చేసుకున్న రెవెన్యూ ఇన్స్పెక్టర్

**ఖానాపూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

ఖానాపూర్ మండలంలోని రాజుర గ్రామపంచాయతీ పరిధిలో 40 ట్రాక్టర్ల ఇసుక డంపును రెవెన్యూ ఇన్స్పెక్టర్, జిపిఓ స్వాధీనం చేసుకున్నారని తహసిల్దార్ తెలిపారు. ఈ నెల 22న రాజుర మార్కండేయ ఆలయ ప్రాంగణంలో స్వాధీనం చేసిన ఇసుకను వేలం వేయనున్నట్లు ప్రకటించారు. వేలంలో పాల్గొనదలచిన వారు రూ.5,000 అడ్వాన్స్ చెల్లించాలని, ఎక్కువ ధర చెప్పిన వారికి ఇసుక కేటాయిస్తామని తెలిపారు. వేలంపాటలో గెలిచిన వారికి డిపాజిట్ తిరిగి ఇవ్వబడుతుందని, మరిన్ని వివరాలకు జిపిఓ, రెవెన్యూ ఇన్స్పెక్టర్లను సంప్రదించాలని తహసిల్దార్ సూచించారు.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలు

**కరీంనగర్/ హుస్నాబాద్/ఖానాపూర్, పెద్దపల్లి ,జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**




అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లాలో పలు ప్రాంతాల్లో యోగా కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. కరీంనగర్‌లో శ్రీ సరస్వతీ శిశు మందిర్‌లో విద్యార్థులు, ఆచార్యులు కలిసి సూర్యనమస్కారాలు, ఆసనాలు, ప్రాణాయామం చేశారు. యోగా శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతతను పెంపొందిస్తుందని పాఠశాల నిర్వాహకులు సూచించారు. హుస్నాబాద్‌లో ధర్మవీర యోగా శిక్షణ శిబిరంలో శిక్షకురాలు అనితాదేవి ఆధ్వర్యంలో సాధకులు యోగాసనాలు, ధ్యానం చేశారు. యోగ సాధన వల్ల కలిగే ప్రయోజనాలను వివరించిన అనంతరం ఆమెను ఘనంగా సన్మానించారు. ఖానాపూర్‌లో జూన్ 21 ప్రత్యేకతపై అవగాహన కల్పించారు. సూర్యుడు కర్కటరేఖపైకి చేరే ఈ రోజున ఉత్తరార్ధగోళంలో అతి ఎక్కువ పగటి సమయం నమోదవుతుందని, భూగోళ శాస్త్ర పరిశీలనలకు ఇది ఒక ముఖ్య సందర్భమని వివరించారు. పెద్దపల్లిలో గాయత్రి విద్యానికేతన్‌లో విద్యార్థులు యోగా ప్రదర్శనలు నిర్వహించారు. యోగా గురువు సురేష్ విద్యార్థులకు ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, క్రమశిక్షణ పెంపొందించే ఆసనాలను శిక్షణ ఇచ్చారు. 8వ తరగతి విద్యార్థి సంపంగి ప్రవీణ్ తన విన్యాసాలతో ప్రత్యేక ప్రశంసలు అందుకున్నాడు. ఈ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులు, సాధకులు ప్రతిరోజూ యోగా సాధన చేయాలని సంకల్పించారు. యోగా ఆరోగ్యానికి, ఆనందానికి, ప్రశాంతతకు మార్గమని నిర్వాహకులు అభిప్రాయపడ్డారు.

# వాసవి వనిత క్లబ్ సమక్షంలో ఉదయాస్తమాన సేవ కార్యక్రమం




**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జమ్మికుంట వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో ఉదయాస్తమాన సేవ కార్యక్రమం ఘనంగా జరిగింది. సమాజానికి ఉపయోగపడే పలు సేవా కార్యక్రమాలను సభ్యులు చేపట్టి సేవా భావాన్ని చాటుకున్నారు. లలిత అమ్మవారి దేవాలయంలో భక్తుల కోసం సిమెంట్ బెంచ్ ఏర్పాటు చేశారు. అయ్యప్ప స్వామి దేవాలయంలో గోవులకు గోగ్రాసం అందించేందుకు సిమెంట్ తొట్టిని ఏర్పాటు చేశారు. మానసిక దివ్యాంగుల పాఠశాలలో ఫస్ట్ ఎయిడ్ బాక్స్, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రభుత్వ బాలికల పాఠశాలలో ప్రతిభావంతులైన విద్యార్థులను శాలువాలతో సన్మానించారు. ప్రజలకు అత్యవసర పరిస్థితుల్లో ఉపయోగపడేలా ప్రధాన కూడలిలో ఎమర్జెన్సీ నంబర్ల జాబితా, రక్తదాతల వివరాలు, బ్లడ్ గ్రూపులు, సంప్రదింపు వివరాలతో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి క్లబ్ అధ్యక్షురాలు అయిత శ్రీలత అధ్యక్షత వహించగా, ప్రధాన కార్యదర్శి సి. హెచ్. జ్యోతి, ఆర్థిక కార్యదర్శి మద్ది సురేఖ పాల్గొన్నారు. గోల్డెన్ స్టార్ పిప్పాల విశ్వేశ్వరరావు, ఐపీసీ కేసీజీఎఫ్ గంప సురేందర్, రీజియన్ చైర్ పర్సన్ రామిని శ్రీనివాస్, జోన్ చైర్ పర్సన్ స్వామిశెట్టి అఖిలాండేశ్వరి, అయితు రమేష్, వైస్ గవర్నర్ తంగళ్లపల్లి రాజాభాస్కర్, గో సేవ కోఆర్డినేటర్ రావికంటి నీలకంఠం, జిల్లా అధికారులు వ్యాంసాని రమేష్, అయిత సుధాకర్ తదితరులు పాల్గొన్నారు. సభ్యులు ఉత్సాహంగా పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. భవిష్యత్తులో మరింత విస్తృతంగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని నిర్వాహకులు తెలిపారు.

# యూనియన్ బ్యాంకులో మౌలిక వసతుల కొరత

**హుస్నాబాద్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**



చిగురుమామిడి మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ శాఖలో కనీస మౌలిక వసతులు లేకపోవడం ఖాతాదారులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని బీజేపీ బూత్ అధ్యక్షుడు దొంత కర్ణాకర్ ఆవేదన వ్యక్తం చేశారు. ప్రతిరోజూ వందలాది మంది మహిళలు, వృద్ధులు బ్యాంకింగ్ సేవల కోసం వస్తున్నా, బాత్రూమ్ సౌకర్యం లేకపోవడం బాధాకరమని ఆయన అన్నారు. గంటల తరబడి వేచి ఉండాల్సి వస్తున్న ప్రజలకు సౌకర్యవంతమైన వాతావరణం కల్పించడం బ్యాంకు యాజమాన్యం బాధ్యత అని పేర్కొన్నారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిగణించి, వెంటనే బాత్రూమ్ సౌకర్యంతో పాటు అవసరమైన మౌలిక వసతులను ఏర్పాటు చేయాలని యూనియన్ బ్యాంక్ ఉన్నతాధికారులను ఆయన విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా**




**కరీంనగర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**

జిల్లాను డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ భాగస్వాములవాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లో జరిగిన నార్కోటిక్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడుతూ, యువతను మత్తు పదార్థాల బారిన పడకుండా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మత్తు పదార్థాల దుష్పరిణామాలపై విస్తృత అవగాహన కల్పించడం ద్వారా సమాజాన్ని సరైన మార్గంలో నడిపించవచ్చని తెలిపారు. పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం మాట్లాడుతూ, ఈ నెల 26న అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యాసంస్థల్లో విద్యార్థులకు, గ్రామ సభల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామని, అక్రమ రవాణా, విక్రయాలపై ప్రత్యేక దాడులు కొనసాగుతున్నాయని తెలిపారు. డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ ఆఫీసర్ పర్వీన్ మాట్లాడుతూ, నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా చేపడుతున్న కార్యక్రమాలను వివరించారు. అనంతరం కలెక్టర్ చిత్రా మిశ్రా, కమిషనర్ గౌస్ ఆలం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో ఎక్సైజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారులు, ఆర్డీవోలు, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# మోడీ పాలనలో ఓబిసిల అభ్యున్నతి

**మానకొండూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం గత 12 ఏళ్లుగా పేద, మధ్యతరగతి, బడుగు బలహీన వర్గాల సంక్షేమం కోసం అనేక పథకాలను అమలు చేస్తోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి తెలిపారు. మానకొండూర్‌లో జరిగిన జన్‌కల్యాణ్ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఓబిసిల ఆర్థిక, సామాజిక సాధికారత కోసం కేంద్రం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందని అన్నారు. పీఎం విశ్వకర్మ యోజన సంప్రదాయ వృత్తులకు కొత్త జీవం పోసిందని, రుణాలు, శిక్షణ, ఆధునిక పనిముట్లు, మార్కెటింగ్ సౌకర్యాలు కల్పించడం ద్వారా కళాకారులను స్వయం సమృద్ధివంతులుగా తీర్చిదిద్దుతున్నారని పేర్కొన్నారు. మోడీ పాలనలో పారదర్శకత పెరిగిందని, ప్రతి రూపాయి నేరుగా లబ్ధిదారుల ఖాతాల్లో చేరుతోందని ఆయన అన్నారు. భారత్‌ను 2047 నాటికి అభివృద్ధి చెందిన దేశాల సరసన నిలబెట్టే లక్ష్యంతో మోడీ నిరంతరం శ్రమిస్తున్నారని, ఆ లక్ష్య సాధనలో ప్రతి కార్యకర్త భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, ఓబీసీ మోర్చా ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# పాఠశాలల్లో యాంటీ డ్రగ్ కార్యక్రమాలు తప్పనిసరి

**- డీఈఓ ఏ. భోజన్న**

**ఖానాపూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**

జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో యాంటీ డ్రగ్ కార్యక్రమాలు తప్పనిసరిగా నిర్వహించాలని జిల్లా విద్యాధికారి ఏ. భోజన్న ఆదేశించారు. శనివారం నిర్వహించిన వెబినార్ అనంతరం ఆయన మాట్లాడుతూ, ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్ పకడ్బందీగా కార్యక్రమాలు చేపట్టి, ఫోటోలు, రిపోర్టులను అదే రోజు సాయంత్రం వరకు మండల విద్యాధికారులకు సమర్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల నిర్మూలనలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని, విద్యార్థులను డ్రగ్స్ బారిన పడకుండా కాపాడే బాధ్యత మనందరిపై ఉందని ఆయన పేర్కొన్నారు. వెబినార్‌కు హాజరు తప్పనిసరి, గైర్హాజరైతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నూతన తహసిల్దార్‌గా కొండం కనకయ్య బాధ్యతలు స్వీకరణ

**హుస్నాబాద్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**



చిగురుమామిడి మండల నూతన తహసిల్దార్‌గా కొండం కనకయ్య శనివారం అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. తహసిల్దార్ కార్యాలయానికి చేరుకున్న ఆయనకు సిబ్బంది ఘన స్వాగతం పలికారు. డిప్యూటీ తహసిల్దార్ పి. కళావతి, రెవెన్యూ ఇన్‌స్పెక్టర్, జిపిఓలు మరియు సిబ్బంది పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కొండం కనకయ్య మాట్లాడుతూ మండల ప్రజలకు రెవెన్యూ సేవలను వేగంగా, పారదర్శకంగా అందించేందుకు కృషి చేస్తానని, సిబ్బంది సమన్వయంతో పనిచేసి మండలాభివృద్ధికి సహకరించాలని పేర్కొన్నారు.

# ఆరోగ్యకరమైన వృద్ధాప్యానికి మార్గం యోగ

అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026ను ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం యోగా అనే ఇతివృత్తంతో ప్రపంచవ్యాప్తంగా జరుపుకుంటున్నారు. యోగా భారతదేశం ప్రపంచానికి అందించిన అమూల్యమైన వారసత్వం. ఇది కేవలం వ్యాయామం కాదు; శరీరం, మనస్సు, ఆత్మల మధ్య సమన్వయాన్ని నెలకొల్పే సమగ్ర జీవన విధానం. 2014లో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను అంతర్జాతీయ యోగా దినోత్సవంగా ప్రకటించగా, 2015లో తొలిసారిగా ప్రపంచవ్యాప్తంగా జరుపుకున్నారు. అప్పటి నుండి యోగా ఒక గ్లోబల్ హెల్త్ ఉద్యమంగా మారింది. అమెరికా, యూరప్, జపాన్, ఆస్ట్రేలియా వంటి దేశాల్లో యోగా కేంద్రాలు, పరిశోధనా సంస్థలు, శిక్షణా కార్యక్రమాలు విస్తృతంగా కొనసాగుతున్నాయి. వృద్ధాప్యంలో శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవడంలో యోగా కీలక పాత్ర పోషిస్తుంది. క్రమం తప్పకుండా యోగా చేయడం వల్ల వృద్ధులు స్వావలంబనతో, ఉత్సాహంగా, ఆరోగ్యంగా జీవించగలుగుతారు. యువత, విద్యార్థులు కూడా ప్రతిరోజూ యోగా సాధన చేస్తే ఏకాగ్రత, జ్ఞాపకశక్తి, ఆత్మవిశ్వాసం పెరుగుతాయి. యోగం శారీరక దృఢత్వం, మానసిక




ప్రశాంతత, జీవనశైలి వ్యాధుల నివారణకు మార్గం. ఇది అన్ని వయస్సుల వారికి ఆరోగ్యాన్ని, ఆనందాన్ని, ప్రశాంతతను అందించే జీవన విధానం. అంతర్జాతీయ యోగా దినోత్సవం 2026 మనందరికీ యోగాను ఒకరోజు కార్యక్రమంగా కాకుండా దైనందిన జీవితంలో భాగం చేసుకోవాలని సందేశం ఇస్తోంది. ప్రతిరోజూ యోగా -- జీవితాంతం ఆరోగ్యం ,యోగమే ఆరోగ్యానికి మార్గం -- యోగమే ఆనందానికి మూలం,ఆరోగ్యకరమైన వృద్ధాప్యం కోసం ప్రతి ఇంటా యోగా, ప్రతి రోజూ యోగా

వ్యాసకర్త
వేల్పుల మహేందర్,
9912775834
ఎం.ఎస్సీ., ఎం.ఏ., ఎం.ఎడ్., అధ్యాపకులు



# పేదల సంక్షేమం, అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

**- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి**

**ఆమనగల్లు, జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పేదల సంక్షేమం, అభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కడ్తాల్ మండలం మైసిగండి చెందిన తులసీ భీంజి దంపతులు నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని టీపీసీసీ సభ్యులు అయిళ్ల శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, సర్పంచ్ ప్రేమ జవహర్ లాల్ నాయక్ శనివారం ఎమ్మెల్యే నారాయణరెడ్డి ప్రారంభించి మాట్లాడారు.. పేదల సొంతింటి కలను సాకారం చేసిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికే దక్కుతుందన్నారు. గత పాలకులు పేదల సంక్షేమాన్ని విస్మరించగా.. ప్రస్తుత ప్రజా ప్రభుత్వం అన్నివర్గాల అభ్యున్నతే లక్ష్యంగా ముందుకు



సాగుతోందని తెలిపారు. గత ప్రభుత్వం చేసిన అప్పులకు వడ్డీలు చెల్లిస్తూ కూడా సంక్షేమ పథకాలను విజయవంతంగా అమలు చేస్తున్నామని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి ప్రజల్లో పెరుగుతున్న ఆదరణను చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు నిరాధార ఆరోపణలు చేస్తున్నాయని ఆరోపించారు. సర్పంచ్ ఎన్ని కల్లో కాంగ్రెస్ మద్దతుదారులను పెద్దఎత్తున గెలిపించారని.. త్వరలో జరగనున్న ఎంపీటీసీ, జెడ్పీ టీసీ ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థుల విజయానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్ రెడ్డి, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మండల అధ్యక్షుడు బిచ్య నాయక్, ఉప సర్పంచ్ హీరాసింగ్ నాయక్, డైరెక్టర్ వెంకటేష్, వార్డు సభ్యులు శత్రు, వినోద్, చందన్, బాబు లాల్, బన్సీ, రవి, రాజు, స్టాలిన్, కిషన్ నాయక్, తులసి రామ్, శేఖర్ గౌడ్, లక్పతి, నరేందర్, రామచందర్, గురుగిళ్ళ లక్ష్మయ్య, సాయికుమార్, శంకర్, అమర్ సింగ్, మల్లేష్, కృష్ణ, రమేష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# డీఎంకేకు మరో షాక్..

### కూటమి నుంచి వైదొలగిన ఐయూఎంఎల్

**చెన్నై జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
తమిళనాడులో ప్రతిపక్షమైన డీఎంకేకు మిత్రపక్షాలు వరుసగా షాక్ ఇస్తున్నాయి. తాజాగా ఆరు దశాబ్దాల పాటు కొనసాగిన రాజకీయ బంధానికి ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ (ఐయూఎంఎల్) ముగింపు పలికింది. డీఎంకే నేతృత్వంలోని కూటమి నుంచి వైదొలుగుతున్నట్లు అధికారికంగా ప్రకటించింది. తమిళనాడు అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే భారీ విజయం సాధించడం ఆ రాష్ట్ర రాజకీయాల్లో పెను మార్పులు సృష్టించింది. దీంతో పలు పార్టీలు తమ వ్యూహాలను, పొత్తులను మార్చుకున్నాయి. కాగా, 2026 అసెంబ్లీ ఎన్నికల్లో డీఎంకే కూటమితో కలిసి పోటీ చేసిన ఐయూఎంఎల్




రెండు స్థానాలు గెలుచుకున్నది. అయితే, ఎన్నికల అనంతరం సీఎం విజయ్ నేతృత్వంలోని టీవీకే ప్రభుత్వానికి ఆ పార్టీ మద్దతు ఇచ్చింది. అధికార కూటమిలో చేరడంతో పాటు, రాష్ట్ర మంత్రివర్గంలోనూ ప్రాతినిధ్యాన్ని దక్కించుకుంది. మరోవైపు ఈ పరిణామాల నేపథ్యంలో డీఎంకే కూటమిని వీడటంపై రాష్ట్ర సర్వసభ్య సమావేశంలో ఐయూఎంఎల్ నిర్ణయం తీసుకున్నది. డీఎంకేతో 60 ఏళ్ల రాజకీయ బంధాన్ని తెంచుకుంటూ ఒక తీర్మానాన్ని ఆమోదించింది. ఐయూఎంఎల్ జాతీయ అధ్యక్షుడు కె.ఎం. ఖాదర్ మొహిదీన్ ఈ విషయాన్ని వెల్లడించారు. తమ పార్టీ దాదాపు 60 ఏళ్లుగా డీఎంకే నేతృత్వంలోని కూటమితో కలిసి ప్రయాణించినట్లు తెలిపారు. ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్థానిక సంస్థల ప్రతినిధులుగా ప్రాతినిధ్యాన్ని పొందినట్లు చెప్పారు. అయితే రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులు మారాయని, అందుకే డీఎంకేను వీడినట్లు ఖాదర్ మొహిదీన్ స్పష్టం చేశారు. 'ద్రవిడ తరహా పాలన కొనసాగుతుందని మేం ఆశించాం. కానీ ప్రజల తీర్పు భిన్నంగా ఉన్నది. టీవీకేకు సంపూర్ణ మెజారిటీ లభించనప్పుడు, రాజకీయ స్థిరత్వాన్ని కాపాడటానికి, తమిళనాడులో రాష్ట్రపతి పాలన విధించే పరిస్థితిని నివారించడానికి ఐయూఎంఎల్ మద్దతు ప్రకటించింది' అని ఆయన అన్నారు.

# ట్రంప్ మాట లెక్కచేయని నెతన్యాహు..

### లెబనాన్‌పై మళ్లీ ఇజ్రాయెల్ దాడులు.. ఐదుగురు మృతి

**న్యూఢిల్లీ జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):**
పశ్చిమాసియాలో యుద్ధాన్ని నివారించి ఇరాన్‌తో శాంతి ఒప్పందానికి అమెరికా సిద్ధమవుతుంటే.. ఈ ప్రయత్నాలకు ఇజ్రాయెల్ గండికొడుతోంది. లెబనాన్‌పై వరుసగా దాడులు చేస్తోంది. శనివారం కూడా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడి చేసింది. దక్షిణ లెబనాన్‌పై ఈ రోజు ఇజ్రాయెల్ జరిపిన దాడిలో ఐదుగురు మరణించారు. హెజ్బొల్లా, ఇజ్రాయెల్ మధ్య శాంతి ఒప్పందం కుదిరిందని అమెరికా ప్రకటించిన కొన్ని గంటల వ్యవధిలోనే.. ఇజ్రాయెల్ దాడికి దిగడం విశేషం. ఈ దాడిపై లెబనాన్ మీడియా వెల్లడించిన వివరాల ప్రకారం.. దక్షిణ లెబనాన్‌లోని నబాతే జిల్లాలోని అనేక ప్రదేశాలపై ఇజ్రాయెల్ డ్రోన్ దాడులు చేసింది. ఈ దాడుల్లో అనేక ఇండ్లు, బిల్డింగులు ధ్వంసమయ్యాయి. ఐదుగురు మరణించారు. ఫిరంగి



దాడులు కూడా జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. కొద్ది రోజులుగా వరుసగా లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు చేస్తోంది. అంతకుముందు శుక్రవారం జరిపిన దాడుల్లో కూడా 16 మంది మరణించారు. అనేకమంది గాయపడగా, పలువురు కూలిన బిల్డింగులు, ఇండ్ల శిథిలాల కింద చిక్కుకుపోయారు. అయితే, ఇజ్రాయెల్ దాడులపై అమెరికా ఆగ్రహంగా ఉంది. ఒకపక్క ఇరాన్‌తో అమెరికా శాంతి ఒప్పందం కుదుర్చుకుని, యుద్ధాన్ని ముగించాలని భావిస్తుంటే.. ఇజ్రాయెల్ మాత్రం ఇరాన్ మిత్రదేశమైన లెబనాన్‌పై దాడులు చేస్తోంది. అక్కడ ఇరాన్ మద్దతుతో నడుస్తున్న హెజ్బొల్లా ఉగ్రవాద శిబిరాల్ని లక్ష్యంగా చేసుకుని ఇజ్రాయెల్ దాడి చేస్తోంది. ఈ దాడుల్ని ఇరాన్ ఖండిస్తోంది. ఇజ్రాయెల్ వైఖరి కారణంగా, స్విట్జర్లాండ్‌లో ఇరాన్, అమెరికా మధ్య జరగాల్సిన తుదిదశ చర్చలు కూడా వాయిదాపడ్డాయి. దీంతో ఇజ్రాయెల్ వైఖరిపై అమెరికా ఆగ్రహంగా ఉంది. ఇదే సమయంలో ఇజ్రాయెల్ అధ్యక్షుడు బెంజమిన్ నెతన్యాహుతో ట్రంప్ మాట్లాడారు. శాంతి ఒప్పందం సమయంలో కాస్త బాధ్యతతో వ్యవహరించాలని నెతన్యాహుకు ట్రంప్ సూచించారు. దాడుల్ని వెంటనే ఆపాలని కోరారు. అయినప్పటికీ.. ట్రంప్ మాటల్ని లెక్కచేయకుండా.. ఇజ్రాయెల్ మాత్రం దాడులు చేస్తూనే ఉంది.

# తెలంగాణ రక్షణ సేన సమక్షంలో కల్వర్ట్ నిర్మాణంపై రాస్తారోకో



**మానకొండూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
: అన్నారం గ్రామంలో కల్వర్ట్ నిర్మాణం పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన ఆధ్వర్యంలో మూడు గంటలపాటు రాస్తారోకో జరిగింది. జిల్లా బాధ్యుడు గుంజపడుగు హరిప్రసాద్ నేతృత్వంలో జరిగిన ఈ ఆందోళనలో పోలీసులు విరమించాలని కోరినా, ప్రభుత్వం నుండి స్పష్టమైన హామీ వచ్చే వరకు పోరాటం కొనసాగిస్తామని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ ఫోన్‌లో మాట్లాడి వారం రోజుల్లో సమస్య పరిష్కరిస్తానని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. హరిప్రసాద్ మాట్లాడుతూ మండలంలోని రోడ్లు, కల్వర్టులు అధ్వానంగా మారి ప్రమాదాలకు కారణమవుతున్నాయని, ఇసుక మాఫియా వాహనాల అధిక లోడింగ్ వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయని ఆరోపించారు. రెండు సంవత్సరాలుగా అధికారంలో ఉన్నా రోడ్లను బాగు చేయకపోవడం ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే రోడ్లను, కల్వర్టులను బాగు చేయకపోతే పెద్ద ఎత్తున నిరసనలు, రాస్తారోకోలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, మహిళా విభాగం ప్రతినిధులు, బీసీ, ఆదివాసి విభాగం నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్థాల బారిన పడకూడదు - పిడిశెట్టి రాజు



**హుస్నాబాద్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):**
కోహెడ మండలంలో యువత, విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేసే మత్తు పదార్థాలను పూర్తిగా నిర్మూలించి జిల్లాను డ్రగ్స్ రహిత ప్రాంతంగా తీర్చిదిద్దాలని సామాజిక కార్యకర్త, గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ అభ్యర్థి పిడిశెట్టి రాజు పిలుపునిచ్చారు. మత్తు పదార్థాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై ప్రజలకు విస్తృత అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. వైద్యుల ప్రిస్క్రిప్షన్ లేకుండా మందులు విక్రయించే మెడికల్ షాపులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. పాఠశాలలు, కళాశాలల్లో స్నేహిత కార్యక్రమం ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్నామని, పోలీస్, ఎక్సైజ్, వైద్య ఆరోగ్య శాఖలు సమన్వయంతో తనిఖీలు నిర్వహిస్తున్నాయని తెలిపారు. హాస్టళ్లు, ఆర్టీసీ కార్గో కేంద్రాలు, ప్రైవేట్ పార్సిల్ సంస్థలు, ఆన్‌లైన్ గోదాముల్లోనూ విస్తృత తనిఖీలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. డ్రగ్ డిటెక్షన్ కిట్లు, డాగ్ స్క్వాడ్లు, నాకాబందీ కార్యక్రమాల ద్వారా మాదకద్రవ్యాల రవాణా, నిల్వలపై నిఘా ఉంచుతున్నామని, నేరాలకు పాల్పడే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్ నిర్మూలనలో నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న పిడిశెట్టి రాజును సిద్దిపేట జిల్లా అదనపు డీసీపీ కుషాల్కర్ అభినందించారు.

# ఎంపీడీవో రత్నాకర్‌రావుకు ఘన సన్మానం



**ఖానాపూర్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్)**
ఖానాపూర్ మండలంలోని బీర్‌నంది ఉన్నత పాఠశాలలో ఇటీవల ఎంపీడీవోగా పదోన్నతి పొందిన రత్నాకర్‌రావును ఘనంగా సన్మానించారు. పాఠశాలను సందర్శించిన సందర్భంగా డీఎల్పీఓ లింగయ్య, ప్రధానోపాధ్యాయుడు జి.ఎల్.వి. ప్రసాద్, ఉపాధ్యాయులు దేవేందర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శి మరియు సిబ్బంది శాలువాతో సన్మానం చేశారు. రత్నాకర్‌రావు పదోన్నతిని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, సిబ్బంది ఆనందం వ్యక్తం చేశారు.

# పేదలకు అండగా ఉంటాము

**- జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్**



**కల్వకుర్తి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని ప్రభుత్వ వయోవృద్ధ అనాధ ఆశ్రమంలో స్వామి వివేకానంద సేవా బృందం, మై భారత్ ఆధ్వర్యంలో "అనుభవాత్మక విద్యా కార్యక్రమం" శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా వృద్ధులకు పండ్లు, సబ్బులు, బ్రెడ్, నిత్యావసర సరుకులు అందజేశారు. అనంతరం వారి ఆరోగ్య పరిస్థితి, ఆహార అలవాట్లు, జీవనశైలిపై సమాచారం సేకరించారు. జాతీయ యువజన అవార్డు గ్రహీత శివకుమార్ మాట్లాడుతూ, "మానవ సేవే మాధవ సేవ. మేము ఎల్లప్పుడూ పేద ప్రజలకు అండగా ఉంటాము. ప్రతి ఒక్కరూ సమాజ సేవలో భాగస్వామ్యం కావాలి" అని సూచించారు. కార్యక్రమంలో సేవా బృందం సభ్యులు ప్రవీణ్, హర్షిత్ తదితరులు పాల్గొన్నారు.

# యోగతో సంపూర్ణ ఆరోగ్యం

**-కల్వకుర్తిలో ఘనంగా అంతర్జాతీయ యోగ దినోత్సవం**





**కల్వకుర్తి, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** కల్వకుర్తి పట్టణంలోని శ్రీ సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో అంతర్జాతీయ యోగ దినోత్సవం శనివారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని స్వామి వివేకానంద సేవా బృందం, మై భారత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్థానిక ముని యోగశాల గురువు గంజి మురళి మార్గదర్శకత్వంలో విద్యార్థులు యోగాసనాలు, వ్యాయామాలు చేశారు. ఈ సందర్భంగా సేవా బృందం అధ్యక్షుడు శివకుమార్ మాట్లాడుతూ, "ప్రతిఒక్కరూ రోజూ కనీసం 20 నిమిషాలు యోగ చేయాలి. యోగ వలన ఆరోగ్యం, ఆయుష్షు పెరుగుతాయి. ప్రధాని నరేంద్ర మోదీ గారు కూడా యోగాన్ని జీవన విధానంలో భాగం చేసుకోవాలని సూచించారు" అని అన్నారు. కార్యక్రమంలో యోగాసనాల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానాచార్యుడు రాజు, సేవా బృందం సభ్యుడు హర్షిత్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# యోగాతో నిత్యము ఆరోగ్యమే

**-ప్రతిరోజూ 30 నిమిషాల యోగ సాధనతో సంపూర్ణ ఆరోగ్యం**



**ఎలిగేడు, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** ఎలిగేడు మండల కేంద్రానికి చెందిన హైకోర్టు అడ్వకేట్, పీహెచ్‌డీ (యోగ) బుర్ర వీరస్వామి గౌడ్ మాట్లాడుతూ, "యోగ ప్రతి ఒక్కరి జీవితంలో ఒక భాగం కావాలి. ప్రతిరోజూ 30 నిమిషాలు యోగ చేయడం వల్ల శారీరక, మానసిక ఆరోగ్యం సిద్ధిస్తుంది" అని అన్నారు. ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఆయన పేర్కొంటూ, "ఆహారం ప్రతి రోజు తీసుకున్నట్లే యోగ సాధన కూడా అలవాటు కావాలి. క్రమం తప్పకుండా యోగాసనాలు వేయడం వల్ల శారీరక దృఢత్వం, మెరుగైన జీర్ణక్రియ, ఒత్తిడి తగ్గి మనశ్శాంతి లభిస్తుంది" అని వివరించారు. అలాగే యోగ వలన బరువు తగ్గడం, రోగనిరోధక శక్తి పెంపు, గుండె ఆరోగ్యం మెరుగుదల సాధ్యమవుతుందని చెప్పారు. ముఖ్యంగా ప్రాణాయామం, ధ్యానం చేయడం ద్వారా ఒత్తిడి, ఆందోళన దూరమవుతాయని, ఆసనాల ద్వారా పొట్టలోని అవయవాలు ఉత్తేజితమై అజీర్తి సమస్యలు తొలగిపోతాయని, మెరుగైన రక్త ప్రసరణతో రక్తపోటు అదుపులో ఉంటుందని తెలిపారు. "ప్రతి రోజు ఉదయం కొంత సమయాన్ని యోగ సాధనకు కేటాయిస్తే నిత్యము ఆరోగ్యంగా, యవ్వనంగా జీవించవచ్చు" అని ఆయన సూచించారు.

# విద్య కమిషన్ సభ్యుడు వెంకటేష్ ను కలిసిన అశోక్



**ఆమనగల్లు, జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** తెలంగాణ రాష్ట్ర విద్యా కమిషన్ సభ్యుడు చారకొండ వెంకటేష్ ను హైద్రాబాద్ లోని ఆయన ఛాంబర్ లో కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ కడ్తాల్ మండల అధ్యక్షుడు పోతుగంటి అశోక్ మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ప్రవేట్ పాఠశాల ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్య కమిషన్ సభ్యుడు వెంకటేష్ ను కోరినట్లు అశోక్ తెలిపారు.

## సంపూర్ణ ఆరోగ్యానికి

# యోగమే మార్గం

**-ప్రపంచానికి భారతదేశం అందించిన అమూల్య ఆరోగ్య వరం -- యోగ**

**-నేడు అంతర్జాతీయ యోగ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ**

వేల ఏళ్ల చరిత్ర కలిగిన యోగం, మానవాళి ఆరోగ్య సాధనలో అపూర్వమైన స్థానం సంపాదించుకుంది. శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత, ఆధ్యాత్మిక వికాసానికి మార్గదర్శకంగా నిలుస్తున్న యోగం నేడు ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది జీవితాల్లో భాగమైంది. భారతీయ ఋషులు ప్రపంచానికి అందించిన ఈ అమూల్య సంపద ఆరోగ్యవంతమైన జీవనానికి దిక్సూచిగా నిలుస్తోంది. సంస్కృతంలోని 'యుజ్' అనే ధాతువు నుంచి పుట్టిన 'యోగ' అనే పదానికి కలపడం లేదా ఐక్యం చేయడం అనే అర్థం ఉంది. శరీరం, మనస్సు, ఆత్మల మధ్య సమన్వయాన్ని సాధించడమే యోగ యొక్క ప్రధాన లక్ష్యం. యోగ సాధన ద్వారా వ్యక్తి తనలోని అంతర్గత శక్తిని గుర్తించి, సమతుల్యమైన జీవన విధానాన్ని అలవర్చుకోగలడు. నేటి యాంత్రిక జీవనశైలిలో ఒత్తిడి, ఆందోళన, నిద్రలేమి, మధుమేహం, అధిక రక్తపోటు, ఊబకాయం వంటి సమస్యలు సర్వసాధారణంగా మారాయి. ఈ ఆరోగ్య సమస్యలకు సమర్థవంతమైన పరిష్కారంగా యోగం నిలుస్తోంది. ప్రతిరోజూ క్రమం తప్పకుండా యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం చేయడం ద్వారా శారీరక శక్తి పెరగడంతో పాటు రోగనిరోధక శక్తి బలోపేతం అవుతుంది. మానసిక ప్రశాంతత లభించి, ఏకాగ్రత పెరుగుతుంది. జీవితంపై



సానుకూల దృక్పథం అలవడటంతో పాటు క్రమశిక్షణ కూడా పెంపొందుతుంది. యోగ ప్రాముఖ్యతను ప్రపంచానికి చాటిచెప్పే క్రమంలో 2014లో భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఐక్యరాజ్యసమితి వేదికగా అంతర్జాతీయ యోగ దినోత్సవాన్ని నిర్వహించాలని ప్రతిపాదించారు. ఈ ప్రతిపాదనకు 177 దేశాల మద్దతు లభించడంతో ఐక్యరాజ్యసమితి జూన్ 21ను 'అంతర్జాతీయ యోగ దినోత్సవం'గా ప్రకటించింది. ఉత్తరార్ధ గోళంలో సంవత్సరంలోనే అత్యంత సుదీర్ఘమైన పగలు ఉండే ఈ రోజుకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంది. 2015 నుంచి ప్రతి ఏడాది ప్రపంచవ్యాప్తంగా యోగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నారు. విద్యార్థుల జ్ఞాపకశక్తి పెంపు నుంచి వృద్ధుల శారీరక చురుకుదనం వరకు యోగం అన్ని వయసుల వారికి ప్రయోజనకరంగా ఉంటుంది. పాఠశాలలు, కళాశాలలు, కార్యాలయాలు, బహిరంగ ప్రదేశాల్లో సామూహిక యోగ సాధన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా యోగపై ప్రజల్లో అవగాహన పెరుగుతోంది. యోగం కేవలం ఒక వ్యాయామ విధానం మాత్రమే కాదు, అది సంపూర్ణ జీవన విధానం. ప్రతి ఒక్కరూ రోజుకు కనీసం అరగంట సమయాన్ని యోగ సాధనకు కేటాయిస్తే ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదపడుతుంది. "యోగం మన సంపద -- ఆరోగ్యం మన హక్కు" అనే సందేశంతో యోగాన్ని జీవితంలో భాగం చేసుకుని ఆరోగ్యకరమైన భారతావని నిర్మాణంలో భాగస్వాములం కావాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు.

**యోగం చేయండి... ఆరోగ్యంగా జీవించండి!**

వ్యాసకర్త
దేవిశెట్టి నవీన్ కుమార్
కరీంనగర్



# పట్టణాభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలి

**- చైర్మన్ పత్యనాయక్**




**ఆమనగల్లు, జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** ఆమనగల్లు పట్టణాభివృద్ధికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ ఛైర్మన్ పత్యనాయక్ అన్నారు. ఆమనగల్లు మున్సిపాలిటీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశానికి కమిషనర్ రాఘవేందర్ రెడ్డి అధ్యక్షత వహించగా ఆయన హాజరై మాట్లాడారు. మున్సిపల్ నిధుల నుంచి పారిశుద్ధ్య కార్మికుల జీతభత్యాలు, పారిశుద్ధ్య వాహనాల మరమ్మతు, పారిశుద్ధ్య సమస్యలు, ఇంజనీరింగ్ విభాగంలో వాటర్ సప్లై, చేతిపంపుల రిపేర్లు, వీధి దీపాల సమస్యలపై కౌన్సిలర్లతో చర్చించారు. మున్సిపాలిటీలో డిగ్రీ, పాలిటెక్నిక్ కళాశాలలు, మహిళ క్యాంటీన్, మహిళ పెట్రోల్ బంక్, స్కిల్ డెవలప్మెంట్ తదితర కార్యాలయ స్థల సేకరణ, కేటాయింపుపై చర్చించి సభ్యులు ఏకగ్రీవ తీర్మాణం చేశారు. కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ తల్లోజు గీత ఆచారి, ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, కౌన్సిలర్ సభ్యులు పాపిశెట్టి రాము, ధోలి మాల్య నాయక్, అనూష శ్రీశైలం, సునీత ప్రశాంత్, ఎనుమల్ల రమేష్, నాగిళ్ల జగన్, దుడ్డు ఆంజనేయులు యాదవ్, నిరంజన్, ఎర్రవోలు మహేష్, మొక్తల వెంకటయ్య, అనిత శ్రీనివాస్ రెడ్డి, ఎంగలి భాగ్యమ్మ రఘు, కో ఆప్షన్ సభ్యులు హలీమా బేగం, కండె సీతారాములమ్మ, అబ్దుల్ ఖాదర్, అల్లాజీ గౌడ్, మున్సిపల్ మేనేజర్ ఆంజనేయులు, ఆయా శాఖల అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే రాజమార్గం

**- జడ్జి అరుణ్ కుమార్**




**ఆమనగల్లు, జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** 'రాజీ మార్గమే రాజమార్గం' అని, కక్షిదారులకు సత్వర న్యాయం చేకూర్చడంలో లోక్ అదాలత్ ఎంతో దోహదపడుతుందని ఆమనగల్లు జూనియర్ సివిల్ కోర్టు జడ్జి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. పట్టణ కేంద్రంలోని సివిల్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్ లో జడ్జి అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. కక్షిదారులు ఎంతో కాలంగా పెండింగులో ఉన్న కేసులను పరిష్కరించుకుని సుహృద్భావ వాతావరణంలో జీవించాలని ఆకాంక్షించారు. రాజీ మార్గమే రాజమార్గం అనే విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలని సూచించారు. అదాలత్ లో మొత్తం 94 కేసులు పరిష్కరించారు. ఈ అదాలత్ లో ఏసీపీ జానకీ రెడ్డి, ఎస్.హెచ్.ఓ వెంకటేశ్వర్లు, ఆమనగల్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు అండేకార్ యాదిలాల్, గ్రంథాలయ కార్యదర్శి గణేష్ గౌడ్, క్రీడా కార్యదర్శి సంతోష్ కుమార్, కార్యవర్గ సభ్యులు సర్దార్ నాయక్, మల్లేష్, జగన్ గౌడ్, కొప్పు కృష్ణ, శిరీష్ కుమార్, ప్రభు నాయక్, శ్రీనివాస్, మహేశ్వర్, శ్రీశైలం పోలీస్ సిబ్బంది, కోర్టు సిబ్బంది తదితరులు ఉన్నారు.

# చదువుతోనే సమాజంలో గుర్తింపు



**ఆమనగల్లు, జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** చదువుతోనే సమాజంలో గుర్తింపు, గౌరవం, ఉన్నత స్థానం లభిస్తాయని డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి అన్నారు. శనివారం తలకొండపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల పరిధిలోని ప్రభుత్వ విద్యాలయాల్లో చదివి పదవ తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఉన్నతి, శిక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డిప్యూటీ తహసీల్దార్ రాజశేఖర్ రెడ్డి, ఎంపీడీఓ సీత రామమ్మ, ఎంఈవో చాంప్లా నాయక్ ముఖ్య అతిథులుగా హాజరై ఫౌండేషన్ ఛైర్మన్ ఎర్ర సుధాకర్ రెడ్డితో కలిసి 37 మంది విద్యార్థులకు 2,500 రివార్డ్, షీల్డ్ అందజేసి శాలువాతో సత్కరించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ.. విద్యార్థి దశ ఎంతో కీలకమైందని, భవిష్యత్ ను తీర్చిదిద్దేది విద్యేనని అన్నారు. ఎంతో మంది నిరుపేదలు ఉన్నత విద్యను అభ్యసించి సమాజంలో మంచి స్థాయిలో ఉండి పలువురికి ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. ప్రస్తుతం కష్టపడి చదివితే భవిష్యత్లో ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శేఖర్, ఫౌండేషన్ సెక్రటరీ బండి రఘుపతి, సభ్యులు శ్రీరామ్, రమేష్, మల్లేష్, యాదగిరి, శివ, నితిన్ మరియు కళాశాల అకాడమీ ఇంచార్జి కృష్ణ కాంత్, హెడ్ మాస్టర్ ఝాన్సీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

# పత్తి సాగు పథకానికి దరఖాస్తుల ఆహ్వానం



**ఆమనగల్లు, జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న 'పత్తి ఉత్పాదక పెంపు మిషన్' పథకానికి రైతులు దరఖాస్తు చేసుకోవాలని ఆమనగల్లు ఏడీఏ శోభారాణి శనివారం ఒక ప్రకటనలో కోరారు. ఆమనగల్లు, మాడుగుల మండలాల్లో 2350 ఎకరాలను లక్ష్యంగా పెట్టుకుని సబ్సిడీపై విత్తనాలు, సాగు వనరులు అందిస్తున్నట్లు తెలిపారు. అధిక సాంద్రత సాగు, దగ్గరగా నాటడం, సమగ్ర పంట యాజమాన్యం ఈ పథకం ముఖ్య లక్ష్యాలన్నారు.

# సాగునీటి ప్రాజెక్టులపై సమీక్ష

**-నాగర్‌కర్నూల్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షతన సమావేశం**




**నాగర్‌కర్నూల్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో శుక్రవారం సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతి, భూ సేకరణ అంశాలపై సమీక్షా సమావేశం జరిగింది. ఈ సమావేశానికి పర్యాటక, సాంస్కృతిక, ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అధ్యక్షత వహించారు.సమావేశంలో రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ జిల్లెల్ల చిన్నారెడ్డి, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి, ఎమ్మెల్యేలు డాక్టర్ వంశీకృష్ణ, కసిరెడ్డి నారాయణరెడ్డి, రాజేశ్‌రెడ్డి, నాగర్‌కర్నూల్ జిల్లా కలెక్టర్ హేమంత్ కేశవ్ పాటిల్, వనపర్తి జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి, గద్వాల జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, నీటిపారుదల, రెవెన్యూ శాఖల అధికారులు పాల్గొన్నారు.ప్రాజెక్టుల పనుల వేగవంతం, భూ సేకరణలో ఎదురవుతున్న సమస్యలు, రైతులకు తగిన పరిహారం, భవిష్యత్‌లో సాగునీటి వనరుల వినియోగం వంటి అంశాలపై విస్తృతంగా చర్చ జరిగింది.

# ఘనంగా అంతర్జాతీయ యోగా దినోత్సవం



**దేవరకొండ, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** దేవరకొండ పట్టణంలోని లిఎం.కె.ఆర్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల (అటానమస్)లిలో శుక్రవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమాన్ని ఎన్‌ఎస్‌ఎస్, ఎన్సీసీ, కళాశాల యోగ విభాగం ఆధ్వర్యంలో నిర్వహించారు.కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ రమావత్ రవి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నల్గొండ యోగ గురువు ఊట్కూరి నాగేశ్వరరావు హాజరై, విద్యార్థులకు యోగాసనాలు చేయించి, “యోగం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలు, మానసిక రుగ్మతలను తొలగించే విధానాలు” వివరించారు.ఈ సందర్భంగా కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఢ ఎన్సీసీ సిటీవో జి. కోటయ్య, యోగ కోఆర్డినేటర్ డాక్టర్ కె. పృథు, ఎన్‌ఎస్‌ఎస్ పి.ఓ డాక్టర్ మకట్ లాల్, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ జి. లింగారెడ్డి, అకాడమిక్ కోఆర్డినేటర్ సి. లింగమయ్య, అధ్యాపక బృందం, ఎన్సీసీ క్యాడెట్స్, ఎన్‌ఎస్‌ఎస్ వాలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు దండు ఇస్తారి జన్మదిన వేడుకలు



**శంషాబాద్ జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** శంషాబాద్ మండల మాజీ సర్పంచ్ల సంఘం అధ్యక్షుడు. సుల్తాన్పల్లి మాజీ సర్పంచ్ దండు ఇస్తారి జన్మదిన వేడుకలు శనివారం సుల్తాన్పల్లి పరిధిలోని బ్యూటీ గ్రీన్ వెంచర్లు బంధుమిత్రులు. ప్రజా సంఘాలు, సర్పంచులు శాలువాలు కప్పి కేక్ కట్ చేయించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ప్రభాకర్ గౌడ్, ఉప సర్పంచ్ దండు శివ,వార్డు సభ్యులు ఎలుగాని రాజు గౌడ్, జగన్, నర్సింగ్ ముదిరాజ్, నాయకులు మల్లికార్జున్, సిద్దయ్య, మైలారం రాజు, శ్రీనివాస్ రెడ్డి, చింటూ, తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ నియోజకవర్గ అధ్యక్షుడు అలమనేటి గోపాల్, నియోజకవర్గ సలహాదారు కోళ్ల యాదయ్య, ఉపాధ్యక్షుడు మాధవచారి తదితరులు పాల్గొన్నారు.

# అంగన్వాడీ కేంద్రాన్ని తనిఖీ



**చిన్న శంకరంపేట్ జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** మండల కేంద్రంలోని 3 అంగన్వాడి కేంద్రాన్ని మండల ప్రత్యేక అధికారి వెంకటయ్య తనిఖీ చేశారు, చిన్నారులకు కల్పిస్తున్న పౌష్టిక ఆహార మరియు సదుపాయల గురించి అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో ఎంపిడివో దామోదర్, అంగన్వాడీ టీచర్ నాగరాణి మరియు ఇతరులు పాల్గొన్నారు

# రాష్ట్రవ్యాప్త పాఠశాలల బంద్‌కు ఏబీవీపీ పిలుపు

**-జూన్ 23న విద్యా వ్యతిరేక విధానాలకు నిరసన**

**నాగర్‌కర్నూల్, జూన్ 20 (నీలగిరి ఎక్స్‌ప్రెస్):** నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఏబీవీపీ) ఆధ్వర్యంలో శుక్రవారం పత్రికా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కన్వీనర్ మొక్తల శాంతన్ మాట్లాడుతూ, “ప్రభుత్వ పాఠశాల విద్యను నిర్వీర్యం చేస్తున్న రాష్ట్ర ప్రభుత్వ విద్యా వ్యతిరేక విధానాలకు నిరసనగా జూన్ 23న రాష్ట్రవ్యాప్తంగా పాఠశాలల బంద్‌కు పిలుపునిస్తున్నాం” అని తెలిపారు. రేషనలైజేషన్ పేరుతో వేలాది ప్రభుత్వ పాఠశాలలను మూసివేయాలన్న ప్రయత్నాలను ప్రభుత్వం తక్షణమే విరమించుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయాల్సిన ప్రభుత్వం, ప్రైవేట్--కార్పొరేట్ విద్యాసంస్థలకు ప్రోత్సాహం అందిస్తూ పేద




విద్యార్థులకు నాణ్యమైన విద్యను దూరం చేస్తోందని విమర్శించారు. ప్రైవేట్ పాఠశాలల్లో ఫీజుల దోపిడీ నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని, ప్రత్యేక చట్టాన్ని వెంటనే తీసుకురావాలని కోరారు. విద్యాహక్కు చట్టం ప్రకారం 25% ఉచిత ప్రవేశాలను కచ్చితంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కొరత, ఉపాధ్యాయుల ఖాళీలు కొనసాగుతున్నాయని, ఖాళీగా ఉన్న టీచింగ్, నాన్-టీచింగ్, ఎంఈఓ పోస్టులను వెంటనే భర్తీ చేయాలని సూచించారు. గురుకుల పాఠశాలలకు శాశ్వత భవనాలు నిర్మించి, విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని కోరారు. “ప్రభుత్వ నిర్లక్ష్యానికి నిదర్శనం యూనిఫాంలు అందించకపోవడమే. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో బ్రేక్‌ఫాస్ట్ స్కీమ్‌ను అమలు చేయాలి” అని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వం విద్యార్థి వ్యతిరేక విధానాలను ఉపసంహరించుకోవాలని హెచ్చరిస్తూ, లేనిపక్షంలో ఏబీవీపీ ఆధ్వర్యంలో మరింత ఉధృతమైన ఆందోళనలు చేపడతామని తెలిపారు. జూన్ 23న జరగనున్న రాష్ట్రవ్యాప్త బంద్‌ను విద్యార్థులు, తల్లిదండ్రులు, విద్యాభిమానులు విజయవంతం చేయాలని మొక్తల శాంతన్ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర కార్యదర్శి ప్రసాద్ కుమార్, నగర సంయుక్త కార్యదర్శి శివ, ఏబీవీపీ నాయకులు పాల్గొన్నారు.

## తన కష్టాలను దాసుకొని పిల్లల భవిష్యత్ ను నిర్మించే గొప్ప వ్యక్తినాన్న

### (అంతర్జాతీయ ఫాదర్స్ డే సందర్భంగా)

కుటుంబం అనే వ్యవస్థకు తండ్రి ఒక మూల స్తంభం. తల్లి ప్రేమకు, ప్రతిరూపమైతే ,తండ్రి బాధ్యతలకు ప్రతీక .సమాజంలో వస్తున్న మార్పులు కుటుంబ వ్యవస్థ జీవన విధానం ఉపాధి అవకాశాలు, విద్యావిధానాలు, సాంకేతికత ,సామాజిక విలువలు మారుతున్నాయి.

ముఖ్యంగా ప్రపంచీకరణ (గ్లోబలైజేషన్ )ప్రభావంతో ప్రపంచం ఒక కు గ్రామంగా మారింది .ఈ మార్పు వల్ల, ఈ మార్పు మధ్యన తండ్రి పాత్ర ,బాధ్యతలు ,కర్తవ్యాలు సవాళ్ళు కూడా విస్తరించాయి. ఫాదర్ డేసందర్భంగా నాడు నేడు భవిష్యత్తులో తండ్రి పాత్రను పరిశీలించడం సమాజానికి అవసరం.

గతంలో తండ్రి కుటుంబానికి ప్రధాన పోషకుడు రక్షకుడు నిర్ణయాధికారి కష్టపడి పనిచేయడం, పిల్లలకు సంస్కారం ,క్రమశిక్షణ నేర్పించడం, కుటుంబ సంప్రదాయాలు విలువలు కాపాడటం ఆస్తులు జీవనోపాధిని సంరక్షించడం సమాజంలో కుటుంబ గౌరవాన్ని నిలబెట్టడం. నాడు తండ్రి సంపాదన పరిమితమైనప్పటికీ కుటుంబ బంధాలు బలంగా ఉండేవి పిల్లలతో ప్రత్యేక్ష్ అనుబంధం ఎక్కువగా ఉండేది. ప్రపంచీకరణ వల్ల తండ్రికి ఎదురవుతున్న సవాళ్లు, ఆర్థిక ఒత్తిడి, సమయ నిర్వహణ, డిజిటల్ యుగ ప్రభావం, విలువల పరిరక్షణ ,మానసిక ఒత్తిడి. పెరుగుతున్న జీవన వ్యయం,విద్యా ఖర్చులు ,వైద్య ఖర్చులు తండ్రి పై అదనపు భారాన్ని పెంచుతున్నాయి. ఉద్యోగం కోసం ఎక్కువ సమయాన్ని కేటాయించవలసి రావడం వలన కుటుంబానికి సమయం తగ్గుతుంది.

సోషల్ మీడియా ,మొబైల్ ఫోన్లు, ఆన్లైన్ ప్రపంచం పిల్లలపై చూపుతున్న ప్రభావాన్ని నియంత్రించడం సవాలుగా మారింది. ప్రపంచ సంస్కృతుల ప్రభావం



మధ్య భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలను కాపాడటం అవసరమైంది. ఉద్యోగ భద్రత, కుటుంబ భవిష్యత్తు, ఆర్థిక ప్రణాళిక, వంటి అంశాలు మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయి.

తండ్రి సంపాదించే వ్యక్తిగా నే కాకుండా జీవిత మార్గదర్శక ఉండవలసిన అవసరం పెరుగుతుంది. పిల్లలకు జీవిత నైపుణ్యాలు నేర్పించడం సరైన నిర్ణయాలు ,సాంకేతిక పరిజ్ఞానంపై అవగాహన కల్పించడం, ప్రకృతి పరిరక్షణ, ఆరోగ్యకరమైన జీవన విధానాన్ని పిల్లలకు అలవాటు చేయడం. కుటుంబానికి భద్రత కల్పించడం, పిల్లలకు మంచి విద్య అందించడం సంస్కారం విలువలు నేర్పించడం, కుటుంబ సభ్యులకు భావోద్వేగ మద్దతు ఇవ్వడం సమాజానికి ఉపయోగపడే పౌరులను తయారు చేయడం. మారుతున్న కాలానికి అనుగుణంగా తనను తాను అభివృద్ధి చేసుకోవడం కుటుంబ ఐక్యతను కాపాడడం అవసరం. తండ్రి జీవితంలో ఎక్కువగా మాట్లాడకపోవచ్చు. కానీ తన కుటుంబం కోసం ఎక్కువ ఆలోచిస్తాడు. తన పిల్లల కలలను, భవిష్యత్తును ,తన భవిష్యత్తుగా భావించి నిరంతరం శ్రమిస్తాడు. తన బాధలను దాచిపెట్టి కుటుంబం సంతోషం కోసం కష్టపడతాడు. తండ్రి ఒక వ్యక్తి కాదు, ఒక బాధ్యత ,ఒక భరోసా, ఒక కుటుంబ వ్యవస్థను ముందుకు నడిపించే జీవన మార్గదర్శి. ప్రపంచీకరణ యుగములో మార్పులు ఎన్నో వచ్చిన తండ్రి ప్రేమ, త్యాగం, బాధ్యత కర్తవ్యాల విలువ ఎప్పటికీ మారదు. నాడు కుటుంబాన్ని నిలబెట్టిన తండ్రి నేడు కుటుంబాన్ని ముందుకు నడిపిస్తున్నాడు. రేపు సమాజాన్ని నిర్మించే తరాన్ని తీర్చిదిద్దే శక్తిగా నిలువబోతున్నాడు. అందువల్ల ప్రతి తండ్రి తన కుటుంబానికి వెన్నెముక, సమాజానికి ఆదర్శం ,దేశ భవిష్యత్తుకు నిర్మాత. నాకు జన్మనిచ్చిన నా తల్లి, నా తల్లి అమరజీవికి సామాజిక విప్లవ జోహార్లు. నా తండ్రికి పాదాభివందనాలతో...

ఫాదర్స్ డే సందర్భంగా ప్రతి తండ్రికి హృదయపూర్వక అభివందనాలతో శుభాకాంక్షలు .

మీ కామేపల్లి లక్ష్మయ్య.టీచర్
సామాజిక వైద్యులు.దేవరకొండ
9542311846.



# రైతులకు ఎలాంటి కొరత లేకుండా సకాలంలో యూరియా అందించాలి

**-అధికారులతో ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ సమీక్షా సమావేశం.**

**దేవరకొండ,జూన్ 20 (నీలగిరి ఎక్స్ ప్రెస్):** రాబోయే వానకాలం (ఖరీఫ్) సాగు సీజన్‌ను దృష్టిలో ఉంచుకుని దేవరకొండ నియోజకవర్గంలోని రైతులకు యూరియా, కాంప్లెక్స్ ఎరువులు మరియు ఇతర వ్యవసాయ అవసరాలు ఎలాంటి కొరత లేకుండా అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ వ్యవసాయ, మార్కెటింగ్ శాఖల అధికారులను ఆదేశించారు. నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించిన ప్రత్యేక సమీక్షా సమావేశంలో ఆయన అధికారులతో ఎరువుల లభ్యత, నిల్వలు మరియు సరఫరా వ్యవస్థపై విస్తృతంగా చర్చించారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, రైతాంగం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక అని, రైతులు సాగు పనుల్లో ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రభుత్వం అన్ని చర్యలు చేపడుతోందని తెలిపారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభానికి ముందే అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను అన్ని మండల కేంద్రాల్లో అందుబాటులో ఉంచాలని సూచించారు.

**ముందస్తు నిల్వలు:**



నియోజకవర్గంలోని అన్ని మండల కేంద్రాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు , రైతు సేవా కేంద్రాలు మరియు ప్రభుత్వ అనుమతి పొందిన ఎరువుల డీలర్ల వద్ద సరిపడా యూరియా, కాంప్లెక్స్ ఎరువుల నిల్వలను ముందుగానే సిద్ధంగా ఉంచాలని అధికారులను ఆదేశించారు.

రైతులకు ఎలాంటి ఇబ్బంది రాకూడదు

వానకాలం సాగు పనులు ప్రారంభమైన తర్వాత ఎరువుల కొరత ఏర్పడకుండా ముందస్తు ప్రణాళికతో సరఫరా వ్యవస్థను పటిష్టం చేయాలని, ప్రతి గ్రామంలోని రైతులకు అవసరమైన ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

**బ్లాక్ మార్కెటింగ్‌పై కఠిన చర్యలు:**

ఎరువులను అక్రమంగా నిల్వ ఉంచడం, కృత్రిమ కొరత సృష్టించడం లేదా ప్రభుత్వం నిర్ణయించిన ధరల కంటే అధిక ధరలకు విక్రయించడం వంటి చర్యలను ఏమాత్రం సహించబోమని ఎమ్మెల్యే హెచ్చరించారు. అలాంటి అక్రమాలకు పాల్పడే డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు అవసరమైతే వారి లైసెన్సులను రద్దు చేయాలని అధికారులను ఆదేశించారు.

**నిరంతర పర్యవేక్షణ:**

ఎరువుల నిల్వలు, పంపిణీ మరియు విక్రయాలపై సంబంధిత అధికారులు నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని, రైతుల నుంచి వచ్చే ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సూచించారు.

రైతులకు అవసరమైన వ్యవసాయ వనరులు సకాలంలో అందించడం ప్రభుత్వ బాధ్యత అని, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ సమీక్షా సమావేశంలో వ్యవసాయ శాఖ అధికారులు, మార్కెటింగ్ శాఖ అధికారులు మరియు సంబంధిత శాఖల సిబ్బంది పాల్గొన్నారు.ం

# నీలగిరి-సాహితీసంగమం -10

### శీర్షిక:- శ్రీనాథుని చాటువు
### ప్రక్రియ:- తేనియలు

రాయలసీమకేగినపుడు
శ్రీనాథుడికి దాహమేసెనట
మిక్కిలిగ దాహ బాధతో
ఆశువుగ పద్యం పలికెనట

లక్ష్మి భార్యకావడం చేత
విష్ణువు ద్వాపరయుగమున జూడ
పదివేలమంది గోపికలతో
సంతోషంగా గడిపెను జూడ

తిరుపెమెత్తి గడుపు శివునికి
ఇరువురు భార్యలెందుకనియె
గంగను పంపమని యడుగుతు
దాహం తీర్చుకుంటాననియె

విజయప్రసాద్ నలుమాసు
కరీంనగర్

### శీర్షిక..శ్రమయేవ జయతే

డబ్బులెవరికీ ఊరికే రావు
అవును డబ్బులు ఊరికే ఎందుకోస్తాయ్?
చెట్లకి కాయవు కదా!
భూమిలోనుంచి తవ్వితే బయటికి రావు కదా!
ఎంగిలి చేత్తో కాకినైనా కొట్టని వారున్న
ఈ ఆధునిక కాలంలో డబ్బులు ఎవరికీ ఊరికే రావు.

రెక్కలు ముక్కలు చేసుకుని శ్రమించాలి
కర్మాగారాల్లో పనిచెయ్యాలి
రాత్రనక పగలనక పొలంలో పని చేసి
పంటలు పండించాలి
ఆడ మగ తేడాలేక మేస్త్రి దగ్గర పనిచేయాలి
అలా కష్టపడితే వచ్చేదే ఐశ్వర్యం.
అలా సంపాదిస్తేనే గౌరవం.
"శ్రమయేవ జయతే ".అనేది ఉపనిషద్వాక్యం.
"శ్రమైక జీవన సౌందర్యం"కు
సమానమైనది లేదు కదా!
అలా శ్రమించి సంపాదిస్తేనే సంతోషం.
దానిని అనుభవించడశీలోని ఆనందమే ఆరోగ్యం.

డా జి భవానీకృష్ణమూర్తి
హైదరాబాదు

### గురువు

తే.గీ.
చదువు నిరతము బోధించి శ్రద్ధ తోడ
శిష్య గణముతో సతతము చెలిమి జేసి
బాల బాలికలకు మంచి భవిత నొసగి
తనరుచుండు గురువెపుడు దైవముగను
తే.గీ.
చదువు తోడ సంస్కారము చాటి గురువు
నలుగురందు మసలుకొను నడత నేర్పి
మేథ నొసగి విద్యార్థికి మేలు గూర్చు
పాఠములు బోధ జేయును పంతులయ్య ( మ్మ)
తే.గీ.
శాస్త్ర రీతి గురువు జేసి జ్ఞాన బోధ
శిష్య కోటిని చెంతకు చేర దీసి
విద్య లోని మెళుకువలన్ విశద పరచి
మానికములన్ వెలికితీయు మట్టి నుండి

మరింగంటి శ్రీనివాస్
హైదరాబాద్

### శీర్షిక-తొలకరి

కం.
తొలకరి చినుకులు పడగా
పులకించును నేలతల్లి పుష్టిన్ వొందున్
పలువిధ పరిమళ భరితపు
విలువల పెంపొందజేయు విశ్వమునందున్.

ఆ.వె.
ఏరువాక సాగు నిలలోన రైతులు
హలము చేతబట్టి పొలముదున్ను
చినుకుపడినవేళ చిరుయాశలుదయించు
నన్నదాతజగతి కాత్మసఖుడు.

ఆ.వె.
మబ్బుగములు జూచి మైమరచుచు నుండు
ఆకసమును జూచునాశమీర
పుడమితడిసినంత నొడలెల్ల పులకించు
భూమికర్షణమున పుష్టినందు.

అవధానిని.డా.గాయత్రీదేవి

### శీర్షిక: "ప్రయత్నము"

తే.గీ.
అసఫలతెదురైన కఠోర యత్నమందు
మరొకసారి ప్రయత్నము మాన్యమౌను,
నీవలన కాదనిన పని నేర్చుకొనుచు
మరొకసారి ప్రయత్నము మాన్యమౌను.
తే.గీ.
ఎదురుదెబ్బలు పడగొట్ట నెగయు కొరకు
మరొకసారి ప్రయత్నము మాన్యమౌను,
నిస్పృహ యలముకొన దైవనిర్ణయమని
మరొకసారి ప్రయత్నము మాన్యమౌను.
తే.గీ.
ఓటమిని గెలుపుగ మార్చు నొరవు కొరకు
మరొకసారి ప్రయత్నము మాన్యమౌను,
సఫలమైన యత్నమటుల చరితగుటకు
మరొకసారి ప్రయత్నము మాన్యమౌను.

వేగరాజు సాయి వర ప్రసాద్,
హైదరాబాదు

### శీర్షిక : మాటలు యందలి భేదము:

**మంజరీ ద్విపద:**
ఎన్ని చదువులున్న నేమి ఫలంబు,
మంచి తనము లేని మాటల వలన
వ్యథలేను కలుగును బ్రతుకు నందెపుడు,
విన సొంపు మాటలు విజయము నిడును,
కరకు మాట వలన కలతలు వచ్చు,
మధురపు మాటలు మమతను పంచు
మృదువగు మాటలు మేలును జేయు
మాటల వలననే మనుజుని గుణము
తేట తెల్లమగుచు , తీరుయు తెలియు,
పద్ధతి నెరుగుచు పలుకుమ పలుకు
ఆచి తూచి పలుకు లానంద మొసగు
మాటయె ప్రధానము మహి నందు నేడు
మాట జూసిడిదురు మనిషికి విలువ
తెలుసుకో మిత్రమా తెలివితో నీవు.

**వసుమతీ జగన్నాథం.**
**హైదరాబాద్.**

### శీర్షిక:- నేను

అటు నేనే ఇటు నేనే
ఎటుచూస్తే అటు నేనే
నీ ఉనికికి కారణాన్ని
నీ నడతకు మూలాన్ని
నీ పెరుగుదలకు
నిలువెత్తు నిదర్శనాన్ని
కాలదోషం పట్టకుండా
నిముషం నిముషం
నీ కడుపున రగిలే
నిత్య దావాగ్నిని నేనే

వేమూరి హనుమంతరావు
హైదరాబాద్

### శీర్షిక: స్వప్న ప్రకరణము 4

ఆ వె
కలలు నిదురలోన కలుగుచుండు నెపుడు
కన్న కలలు పూర్తి కావు నిజము
ఎన్ని కలలు గన్న నెవ్వి గుర్తుండవు
కొన్ని మాత్ర ముందు కొంత వరకు

ఆ వె
మొదటి జాము కలలు ముప్పది శాతము
అర్థ రాత్రి కలలు అరువదియును
తొంటి సంధ్య ముందు తొంబది శాతము
వాస్తవ మగు ననియు పలుకు గలదు

ఆ వె
వచ్చు చుండు కలలు పలు కారణంబుల
చింతజములు గలుగు చింత వలన
నాది లేని వైన యాదృచ్ఛికములుగ
వ్యాధిజములు గలుగు వ్యాధి వలన

సత్యనారాయణ బొలిశెట్టి,
హైదరాబాద్

### వ్యాసభగవానుడు
### ప్రక్రియ పద్యము

మత్తకోకిల
వేదముల్ విభజించి గొప్పగ ప్రీతి గొల్పిన వ్యాసునిన్
సాదరంబుగ కొల్చుకుందుము సారమిమ్మని వేడుచున్
వేదనల్ తొలగింప జేయుచు భీతి దీర్చగ శీఘ్రమే
మోదమందగ దల్చుకొందుము పూజలొసంగుచున్
పంచచామరము
ప్రరూఢమైన జ్ఞాన మెంతొ భద్రపర్చిపెమ్మిగా
విరాజమానమై ప్రగాఢ వెల్గులీనె ధాత్రినిన్
వరమ్ముగా రచించినారు వాఙ్మయమ్ముధాటిగా
పరాశరాత్మజా సతంబు భక్తిమీర మ్రొక్కెదన్

మాతా గంగాభవాని శాంకరీ దేవి,
చెన్నై.

### గజ్జలమ్మ

ఆటవెలది

కన్ను లందు నిన్ను గాంచిన తోడనె
కలము చేతబట్టి కవితరాయ
మనసు కలిగె నాకు మదిలోన ముదముతో
కరుణజూపు తల్లిగజ్జలమ్మ

నిన్ను కొలచినంత నిధులు దొరుకుతాయి
తలచి నంతలోనె ధనము కలుగు
ధనము వలన జనుల దారిద్ర్య మును తొల్గు
కరుణజూపు తల్లిగజ్జలమ్మ

అవని నేలు తల్లి యాశీర్వదించుము
కుంతలపుర వాసి కాంత రమణి
గాంచవమ్మ మమ్ము కరుణతో నెప్పుడు
కరుణజూపు తల్లిగజ్జలమ్మ

..జాధవ్ పుండలిక్ రావు పాటిల్

### జీవిత సత్యం

తినేది అరిగించుకోలేక పస్తులుండేవారు కొందరైతే..
ఎంగిలి మెతుకులతో కడుపు నింపుకునేవారు మరికొందరు!
ఒంటినిండా నగలున్నా.. దిగులుతో కుమిలేవారు కొందరైతే,
చిల్లులు పడిన దుస్తులతోనే.. చిరునవ్వులు చిందించేవారు కొందరు!
ఏమిటో ఈ వింత అనిపిస్తుంది కానీ..
ఈ జగత్తులో ఇదే సత్యం !
కన్న కలలు నిజం కాక.. ఊహల్లోనే బతికేవారు కొందరైతే,
అన్నీ సౌకర్యాలు ఉన్నా.. అసంతృప్తితో రగిలేవారు మరికొందరు!
?కూలి వేషం కడితే గానీ.. పూట గడవని వారు కొందరైతే,
అడ్డదారుల్లో అన్యాయంగా.. కోట్లు గడించేవారు మరికొందరు!
నమ్మడానికి చేదుగా ఉన్నా కానీ..
ఈ సృష్టిలో ఇదే సత్యం !

పోడేటి సమజ్ఞ,
డిగ్రీ సెకండ్ ఇయర్,
కరీంనగర్

### శీర్షిక:- శారదా మాత

ఉత్పలమాల మాలిక

వెల్లువ కాంతులీనుచును వెల్గెడి పున్నమి చంద్ర బింబమున్
జల్లుగ జాలువారెడితుషారము శీతల సానుమంతమున్
మల్లెలు పచ్చకప్పురము మందరవృక్షము పాల వెల్లియున్
చల్లని నింగిలో మసలు శారద రాత్రుల మేఘ మాలికల్
రెల్లుఫణీశుడున్ సురకరి ప్రవరమ్మును రాజ హంసలున్
వెల్లని పద్మపుంజములు ఫేనము జాజులుమంచి గంధ మీ
తెల్లని వన్ని నీ ధవళ దేహపు కాంతికి సాటిరావిలన్
తల్లివి జ్ఞాననేత్ర విదితా! సురసేవిత పాద ! శారదా

గన్నవరపు శర్మ

### అంశం : చలివేంద్రం.
### ఆటవెలదులు

వేసవనుచు తాను వేడి గాడ్పుల తోడ
నుధృతముగ వచ్చె నురుము పగిది
భీషణాకృతి గొని బెంబేలు పెట్టుచు నెదురు లేని
యెండ నేడు వచ్చె.

పాద చారులకయి బడలిక తీర్చగ
బాటను వెలసె చలిపందిరి వడి
వడిగ నడుచు చుండు వారి తాపము తీర్చు
దాహమడప చేయు ధర్మశాల.

కుండ నిండ జలము
కూరిమి మజ్జిగ
నింపి పంచెదరట నిర్మాలము గా
చలువ నీటి కేంద్రములు వెలయుచునుండు
దాహమడప జేయు ధర్మశాల.

పేరి భార్గవి
విశాఖపట్నం

## పూల సందేశం

మల్లె చెబుతుంది...చీకటిలోనైనా పరిమళాలు వెదజల్లమని!
గులాబీ చెబుతుంది... ముళ్ల వంటి శక్తితో నీకు నువ్వే అండగా నిలవమని!
?చామంతి చెబుతుంది... రంగురంగుల కళలతో నీ జీవితాన్ని పెంచుకోమని!
బంతి చెబుతుంది... పసిడి కాంతితో నీ ఆరోగ్యాన్ని కాపాడుకోమని!
?కమలం చెబుతుంది... చుట్టూ ఉన్న బురదను చూసి అధైర్యపడవద్దని!
మందారం చెబుతుంది... దైవచింతనను ఎన్నడూ మరువద్దని!
?కనకాంబరం చెబుతుంది... మృదువైన మాటలతో పనులు సులువు చేసుకోమని!
సన్నజాజి చెబుతుంది... దొరికిన ఆసరాను చక్కగా వాడుకోమని!
తామర చెబుతుంది... నీ ఉనికితోనే కొలనుకు (సమాజానికి) అందం తెమ్మని!

ఆస్మిన్, బి. యస్సీ.
నపర్తి.

### అంశం : ప్రేమ

ప్రేమానురాగాలే ప్రత్యేక స్థానం
మానవ లోక మానస మందిరం
మధుర కావ్య రచనల సంగమం
అద్భుతమైన దైవ ప్రసాదిత వరం
సిరిసంపదలతో కొలవలేని కొలమానం
అంతరంగాన కొలువున్న ప్రేమ కుసుమం
బంధాలను కొనసాగించే అపురూప శిల్పం
జ్ఞాపకాలను పుణికిపుచ్చుకున్న ప్రేమాలయం
బాల్యం నుండే మనలను ఆశ్రయించిన మానస సరోవరం
రుచులను ఎన్ని చవిచూసినా తనివితీరని శాశ్వత పరిష్కారం
తడుముకోకుండా అందరి మదిలో ప్రవహించే గంగా నదీ సమానం
ప్రేమను అందరికీ పంచుదాం
ప్రేమలో మనకు మనమే రారాజులం

శశిశేఖర్ అల్లంకి
ఏలూరు

### శీర్షిక...మాధుర్యపు సిరులు!

ఆటవెలది

మనసునందునున్న మలినంబు తొలగించు
చక్కనైన రీతి జగతి దోచు
కల్మషమును నింప కంటకములు వచ్చు
క్రోధ బుద్ధి వదల మోదమలరు!

చెడును తలచినంత చేటువచ్చునెపుడు
మనసునందు నిలుపు మంచితనము
మానవత్వమున్న మహినందు వెలుగొందు
తెలుసుకున్న భవము తేజమలరు!

మాట జారవలదు మనసునొచ్చుకొనును
తూట వలెను మదిని తూట్లు పొడచు
మనసులోన గల్గు మాధుర్యపు సిరులు
పంచినంత బ్రతుకు పరిఢవిల్లు!

కొంటికర్ల లలిత

### "హరినామామృతం"

సీ.శ్రీ.శ్రీ
మాధవా!శ్రీకృష్ణ! మధుసూదనా,శేష శాయీయనినను క్లేశములుదొలగు!
పద్మాక్ష ,దైత్యారి, పంకజాక్షా,చక్రి
బ్రహ్మానాభాయన్న బలముకలుగు!
పుండరీకాక్షహే పురుషోత్తమా,విష్ణు
శ్రీధరా!యన్నను చింతదొలగు
దామోదరా,శౌరి, ధరణీధరాదేవ
దానవారియటన్న ధైర్యమబ్బు!

తే.గీ.శ్రీ.శ్రీ
వామనానంత లక్ష్మీశ పావనుండ
నీచరణములే రక్షయౌ నీరజాక్ష!
కలిత యాదాద్రి రూప లక్ష్మయ్య పోష
కృపను జూపు నృసింహ మోకిలనివాస!

రఘుపాత్రుని.సాయిశివలి
శ్రీకాకుళం జిల్లా.

# సోషియో ఫాంటసీగా నాగబంధం

## -ట్రైలర్‌ను విడుదల చేసిన చిత్ర బృందం




యువ నటుడు విరాట్ కర్ణ, గ్లామరస్ బ్యూటీ నభా నటేష్ జంటగా నటిస్తున్న సోషియో ఫాంటసీ అడ్వెంచర్ చిత్రం 'నాగబంధం' ట్రైలర్‌ను చిత్ర బృందం ఘనంగా విడుదల చేసింది. హైదరాబాద్‌లోని ప్రసాద్స్ పిసిఎక్స్ థియేటర్‌లో యూనిట్ సభ్యుల సమక్షంలో ట్రైలర్ లాంచ్ ఈవెంట్ జరిగింది. అభిషేక్ పిక్చర్స్, ఎన్ఐకే స్టూడియోస్ పతాకాలపై కిషోర్ అన్నపురెడ్డి, నిషిత నాగిరెడ్డి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ప్రముఖ నిర్మాత అభిషేక్ నామా కథ, స్క్రీన్‌ప్లే అందించడంతో పాటు ఈ సినిమాతో దర్శకుడిగా మారారు. ట్రైలర్‌లో చూపించిన విజువల్ ఎఫెక్ట్స్ అన్నీ తెలుగు సాంకేతిక నిపుణులే రూపొందించడం విశేషం. పురాతన ఆలయాలు, గ్రాఫిక్స్ విజువల్స్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. మన పురాతన విష్ణు ఆలయాలు, వాటి వెనుక దాగి ఉన్న రహస్యాలు, సనాతన ధర్మం మరియు చారిత్రక అంశాల నేపథ్యంలో మైథాలజీ అడ్వెంచర్ స్పెక్టకిల్‌గా ఈ చిత్రం తెరకెక్కింది. ఈ సినిమాలో విరాట్ కర్ణ శివ తరహా మాస్ లుక్‌లో కనిపించనుండగా, చాలా రోజుల తర్వాత నభా నటేష్ పవర్‌ఫుల్ పాత్రలో మెరవబోతోంది. వీరితో పాటు ఐశ్వర్యా మీనన్, జగపతి బాబు, మహేష్ మంజ్రేకర్, మురళీ శర్మ కీలక పాత్రల్లో నటిస్తున్నారు. జునైద్ కుమార్ మరియు అబీ అందించిన బ్యాక్‌గ్రౌండ్ స్కోర్ ట్రైలర్‌కు భారీ హైప్ తీసుకొచ్చింది విజువల్‌గా, సాంకేతికంగా ఈ సినిమా థియేటర్లలో ప్రేక్షకులకు గ్రాండ్ ఎక్స్‌పీరియన్స్ ఇస్తుందని, ప్రతి రూపాయి తెరపై స్పష్టంగా కనిపిస్తుందని దర్శకుడు అభిషేక్ నామా తెలిపారు. మన పురాతన ఆలయాలు, వాటి వెనుక ఉన్న చరిత్రను తర్వాత తరాలకు తెలియజేసేలా ఈ సినిమా ఉంటుందని హీరో విరాట్ కర్ణ చెప్పారు. 'నాగబంధం' చిత్రం పాన్ ఇండియా స్థాయిలో తెలుగుతో పాటు మలయాళం, తమిళం, హిందీ భాషల్లో జూలై 03న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## మా ఇంటి బంగారం

# ఓపెనింగ్ కలెక్షన్స్ అదుర్స్




సమంత ప్రధాన పాత్రలో నటించిన లేటెస్ట్ యాక్షన్ డ్రామా 'మా ఇంటి బంగారం' థియేటర్లలో సాలిడ్ ఓపెనింగ్ సాధించింది. ట్రేడ్ వర్గాల ప్రకారం ఈ చిత్రం తొలిరోజు భారతదేశంలో రూ.5.35 కోట్ల నెట్ వసూళ్లను రాబట్టినట్లు తెలుస్తుంది. దీంతో ఇండియా గ్రాస్ కలెక్షన్ సుమారు రూ.6.20 కోట్లుగా నమోదుకాగా. దేశవ్యాప్తంగా 2,658 షోలలో ఈ సినిమా ప్రదర్శితమైంది. ఓవర్సీస్ మార్కెట్ నుంచి మరో రూ.4.50 కోట్ల గ్రాస్ రావడంతో తొలిరోజు వరల్డ్‌వైడ్ గ్రాస్ కలెక్షన్ రూ.10.70 కోట్లకు చేరింది. రిజియన్ వారీగా చూస్తే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ కలిపి రూ.4.75 కోట్ల గ్రాస్‌తో టాప్‌లో నిలిచాయి. కర్ణాటకలో రూ.90 లక్షలు, తమిళనాడులో రూ.38 లక్షల గ్రాస్ వసూళ్లు నమోదయ్యాయి. తెలుగు 2అ వెర్షన్‌కు ఆక్యుపెన్సీ రోజంతా పెరుగుతూ వచ్చింది. ఉదయం షోలకు 26.15 శాతం ఉన్న ఆక్యుపెన్సీ, రాత్రి షోలకు 51.38 శాతానికి చేరింది. ప్రీమియం తెలుగు ఇఖఎఖి ఫార్మాట్‌కు 96 శాతం ఓవరాల్ ఆక్యుపెన్సీ నమోదైంది. హైదరాబాద్‌లో దాదాపు హౌస్‌ఫుల్స్ పడగా, రాత్రి షోలకు 100 శాతం ఆక్యుపెన్సీ వచ్చింది. 'ఖుషి' 2023 తర్వాత సమంత తెలుగు సినిమాలో లీడ్ రోల్‌లో నటించిన చిత్రం ఇదే కావడంతో ఈ సినిమాపై విడుదలకు ముందు నుంచే భారీ అంచనాలు నెలకొన్నాయి. అయితే ఆ అంచనాలను నిజం చేస్తూ ఈ చిత్రం బాక్సాఫీస్ వద్ద దూసుకుపోతుంది. నందిని రెడ్డి దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో దిగంత్, గుల్షన్ దేవయ్య, గౌతమి, మంజుష, శ్రీముఖి,శ్రీలక్ష్మి కీలక పాత్రల్లో నటించారు.

# ఓటిటిలోకి అర్జున్ బ్లాస్ మూవీ




చాలా రోజుల తర్వాత అర్జున్ తన యాక్షన్‌తో మెప్పించిన చిత్రం 'బ్లాస్ట్'. ఇటీవల ప్రేక్షకుల ముందుకువచ్చిన ఈ సినిమా పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది. ఇప్పుడీ చిత్రం ఓటీటీ ఆడియన్స్‌ను అలరించేందుకు సిద్ధమైంది. నెట్‌ఫ్లిక్స్ వేదికగా జూన్ 25 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని నెట్‌ఫ్లిక్స్ అధికారికంగా వెల్లడించింది. కొన్ని రోజులుగా దీని ఓటీటీ తేదీపై వార్తలు వస్తున్నప్పటికీ నేడు నెట్‌ఫ్లిక్స్ అధికారిక తేదీని వెల్లడించింది. సుభాష్ కె రాజ్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో ప్రీతీ ముకుందన్, అభిరామి, అర్జున్ చిదంబరం తదితరులు నటించారు.

# సోషల్ మీడియాకు గుడ్‌బై చెప్పిన 'ఫంకీ' నటి.. కారణం ఇదే!



ప్రముఖ నటి కయాదు లోహర్ సోషల్ మీడియాకు తాత్కాలికంగా దూరంగా ఉండాలని నిర్ణయించుకుంది. శరీరానికి ఎలా విశ్రాంతి అవసరమో మనసుకు కూడా అలాంటి బ్రేక్ కావాలని భావించి ఈ నిర్ణయం తీసుకున్నట్లు తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా అభిమానులకు వెల్లడించింది. కొంతకాలం స్క్రీన్‌కు దూరంగా ఉంటూ నిజ జీవితంతో మమేకం కావాలని, తనతో తాను ఎక్కువ సమయం గడపాలని అనుకుంటున్నట్లు ఆమె తెలిపింది. ఈ విషయంపై కయాదు ఇన్‌స్టాలో పోస్ట్ పెడుతూ.. "సోషల్ మీడియా నుంచి చిన్న అడుగు వెనక్కి వేస్తున్నాను. కొన్నిసార్లు మనం శరీరానికి ఇచ్చే విశ్రాంతి మనసుకు కూడా అవసరం. నేను కాస్త నెమ్మదించి, డిస్‌కనెక్ట్ అవ్వాలని, స్క్రీన్‌కు అవతల ఉన్న జీవితంతో, నాతో నేను ఎక్కువ సమయం గడపాలని భావిస్తున్నాను" అని రాశారు. ఇన్నిరోజులు నాకు మద్దతుగా నిలిచి, ప్రోత్సహించిన, దయ చూపిన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మీ ప్రేమ, సందేశాలు నాకు ఎంతో విలువైనవి. నేను కొంతకాలం సోషల్ మీడియాకు దూరంగా ఉంటాను, కానీ ఏవైనా ముఖ్యమైన అప్‌డేట్స్ ఉంటే నా టీమ్ ఈ ఖాతా ద్వారా పంచుకుంటుంది. అందరూ సంతోషం, దయతో ఉండాలని కోరుకుంటున్నాను. త్వరలో కలుద్దాం అని పేర్కొన్నారు. సినిమాల విషయానికి వస్తే.. ఇటీవలే ఫంకీతో అలరించిన ఈ భామ తెలుగులో నాని సరసన ది ప్యారడైజ్ చిత్రంలో నటిస్తుంది. ఇదే కాకుండా దర్శకుడు మరియప్పన్ చిన్న తెరకెక్కిస్తున్న తమిళ్ హారర్ థ్రిల్లర్ 'ఇమ్మోర్టల్'లో నటిస్తున్నారు. ఈ చిత్రంలో ఆమెకు జోడీగా నటుడు, సంగీత దర్శకుడు జీవీ ప్రకాశ్ కుమార్ కనిపించనున్నారు. ఇటీవల విడుదలైన టీజర్‌కు ప్రేక్షకుల నుంచి మంచి స్పందన వచ్చింది. ఈ సినిమాలో టీఎం కార్తీక్, కుమార్ నటరాజన్, లొల్లు సభ మారన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. అరుణ్‌కుమార్ ధనశేఖరన్ నిర్మిస్తున్న ఈ చిత్రానికి శామ్ సీఎస్ సంగీతం అందిస్తున్నారు.

# కాక్‌టెయిల్ 2 కుటుంబ కథా చిత్రం



షాహిద్ కపూర్ హీరోగా రష్మిక, కృతిసనన్ ప్రధాన పాత్రల్లో నటించిన సినిమా 'కాక్‌టెయిల్ 2' . ఈ ట్రయాంగిల్ లవ్‌స్టోరీ తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చింది. ఈ నేపథ్యంలో దీని సెన్సార్ సర్టిఫికెట్‌పై షాహిద్ కపూర్ మాట్లాడారు. ఇది కుటుంబకథా చిత్రమని దీనికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో అర్థం కాలేదని అన్నారు. సోషల్ మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఆయన దీని గురించి మాట్లాడారు. 'ఈ సినిమాలో అభ్యంతరకరమైన, అసభ్య సన్నివేశాలు ఏవీ లేవు. సినిమా మొత్తంలో అలాంటిది ఒక్క సీన్ కూడా ఉండదు. అలాంటి చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్ ఎందుకు ఇచ్చారో ఇప్పటికీ ఆలోచిస్తూనే ఉన్నాను. ఎంత ప్రయత్నం చేసినా నాకు అర్థం కావట్లేదు. ఇది ముగ్గురు వ్యక్తుల మధ్య జరిగే కథ. కుటుంబ సభ్యులందరితో కలిసి చూసే చిత్రం అని స్పష్టం చేశారు. ప్రేక్షకులు ఈ సినిమా చూసి థియేటర్ నుంచి నవ్వుతూ బయటకు వస్తారని ఆయన అన్నారు. హోమీ అదజానియా దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమా లెస్బియన్ లవ్‌స్టోరీ అంటూ జరిగిన ప్రచారాన్ని కూడా కృతిసనన్ తాజాగా ఖండించారు. ఈ చిత్రం ముగ్గురు ప్రధాన పాత్రల చుట్టూ తిరిగే ఓ ఎమోషనల్ డ్రామా అని చెప్పారు. భారీ అంచనాల మధ్య విడుదలైన ఈ సినిమా తొలిరోజు రూ.13 కోట్లు వసూలుచేసినట్లు చిత్రబృందం తెలిపింది. ఈ వీకెండ్ కలెక్షన్స్ పెరిగే అవకాశం ఉందని పేర్కొంది.